నమ్మలేని నిజాలు

జెండాల పోరు
అనాథలు లేవండి
మనకో జెండా

వెలి వేతలు
జీవన కాలచక్రం
షష్ఠి టూ శతం.

ఓట్ల తంత్రం
మిత్ర శత్రు భేదాలు
కుర్చీ సారాంశం

తుపాను సుడి
రెమాల్ రాక పోకడ
నీరే కన్నీరు

తిరుగుబోతు
జనంఖాతలో ఖర్చు
గ్రామ మహిషం

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

తెలంగాణ ఆవిర్భావ
దినోత్సవం జూన్ రెండు!
పదేళ్ళు దాటుతున్నా
బాగ పండేనా పండు ?

రాష్ట్రాల్లోనే మేటోయ్
తెచ్చుకున్న తెలంగాణ !
దుమికి దుమికి ఎగరండోయ్
ధూంధాం బజానా గాన !

శ్రీనిజాలు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 30-5-2024 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :30 | సంచిక:232 | పేజీలు:6 | వెల: రూ.1/-

## తుఫాను బీభత్సం.. మిజోరాంలో 27 మంది మృతి



న్యూఢిల్లీ, మే 29 :రెమాల్ తుఫాను కారణంగా ఐజ్వాల్ జిల్లాలో 27 మంది మరణించారని మిజోరాం సమాచార, పౌరసంబంధాల శాఖ సమాచారం ఇచ్చింది. వర్షాల తర్వాత కొండచరియలు విరిగిపడటంతో వీరంతా చనిపోయారు.

మేఘాలయలో, తుఫాను ప్రభావంతో ఇద్దరు వ్యక్తులు, అస్సాంలో, రెమల్ తుఫాను కారణంగా వర్షాల కారణంగా ముగ్గురు, నాగాలాండ్‌లో ఇలాంటి సంఘటనలలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కాగా, రాష్ట్ర విపత్తు సహాయ నిధికి మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమ రూ.15 కోట్లు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం ప్రకటించిందని సమాచార పౌరసంబంధాల శాఖ తెలిపింది.

## ఎన్నికల కోడ్ ముగియగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్

హైదరాబాద్ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):కొత్త రేషన్ కార్డులు ఎప్పుడొస్తాయా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న తెలంగాణ ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ శుభవార్త చెప్పారు. ఈ మేరకు ఎన్నికల కోడ్ ముగియగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రకటిస్తూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా రేషన్ కార్డులు మాత్రం రాలేదు. సంక్షేమ పథకాలు లబ్దిదారులకి చేరాలంటే రేషన్ కార్డు తప్పనిసరి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయడంలో నిర్లక్ష్యం చేసింది. సంక్షేమ పథకాలను అందుకునే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ రేషన్ కార్డు ఉంటేనే పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీలకు అర్హులు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను జారీ చేయడానికి ముందుకొచ్చింది. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ఈ ప్రక్రియ మొదలుపెడతాం. రేషన్ కార్డులు లేక పేద, మధ్య తరగతి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆ బాధలను తీర్చడానికి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి వారికి కానుకగా ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందని వివరించారు.

## లోయలో పడిన బస్సు.. 28మంది మృతి



న్యూఢిల్లీ, మే 29 :ప్రమాదవశాత్తు బస్సు అదుపు తప్పి లోయలో పడ్డ ఘటనలో 28మంది మృతిచెందిన ఘటన పాకిస్థాన్‌లో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో 22 మందికిపైగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బస్సు టైరు పేలిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. బలూచిస్థాన్‌లోని టుర్బాట్ నుంచి క్వెట్టాకు వెళ్తున్న బస్సు వాషుక్ టౌక్ సమీపంలో ప్రమాదానికి గురైంది.

## ఎక్సైజ్ కార్యాలయంలో రక్తదాన శిబిరం



హైదరాబాద్, మే 29 :వికారా బాద్ జిల్లా ఎక్సైస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాల యంలో రక్తదాన శిబిరాన్నిబుధవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరి టెండెంట్ విజయ భాస్కర్ గౌడ్, వికారాబాద్ సిఐ రాఘువిన సిబ్బంది తో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ విజయభాస్కర్ గౌడ్ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని అవసరమున్నవారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవేనా, ఎస్సై వాణి, సిఐలు వీరాంజనేయులు పాల్గొన్నారు.

## చురక

ప్రభుత్వం ఎవరిదైనా
ఫోన్ ట్యాపింగ్ నేరం
పాలకులకు ఏ శిక్ష లు
పడకుంటే మరి ఘోరం
బాధ్యులైనా అధినేతలు
బలిపశులు అధికారులె
చట్టపరిధి ప్రాపు కొరకు
జవదాటితే అపచారులె



-వేల్పుల నారాయణ
9440433475

### నేటి కందం- నేటికీ అందం

ఘనమగు వార్తాచయమును
మననీయంబగు నుదంత మార్తాండముగా
మనవారలు హిందీలో
నొనగూర్చిరి సంతసమ్ము లొలుకగ ధరణిన్



(30-5-1826 మొట్టమొదటి హిందీ వార్తాపత్రిక ఉదంత్ మార్తాండ్ ప్రారంభమైన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

## తెలంగాణ రాష్ట్ర చిహ్నం తుదిరూపుపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్, మే 29 :తెలంగాణ రాష్ట్ర చిహ్నం తుది రూపుపై జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చిహ్నం తుదిరూపుపై కళాకారుడు రుద్ర రాజేశంతో చర్చించారు. జూన్ 2వ తేదీన అధికారిక చిహ్నంను రేవంత్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, జేఏసీ నేత రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గంను అనుసరించాలి- మంత్రి సీతక్క



హైదరాబాద్, మే 29 :సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గంను అనుసరించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఈరోజు హైదరాబాద్ కొంపెల్లిలో సంత్ సేవాలాల్ మహారాజ్ ను దర్శించు కున్న మంత్రి.. అనంతరం మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారన్నారు. ఆయన పరమపదించి దాదాపు రెండు వందల సంవత్సరాలు దాటినా కూడా సేవాలాల్ మహారాజ్ ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అహింసా మార్గాన్ని అవలంబించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోం దన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ ఇద్దరు నక్సల్స్ మృతి

రాయ్‌పూర్ మే 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకోవడంతో ఇద్దరు నక్సల్స్ మృతి చెందారు. భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున మందుగుండు సామాగ్రి, ఎకె 47 రైఫిళ్లు, నిషేధిత సాహిత్య పుస్తకాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సోమవారం బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చీకరుబట్టి-పుస్పాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఆరుగురు మావోలు మృతి చెందిన విషయం తెలిసిందే.

## ఆ దృశ్యాలు కలచి వేస్తున్నాయి.. రఫాలో ఇజ్రాయెల్ దాడులను ఖండించిన అమెరికా



న్యూఢిల్లీ, మే 29 : రఫా నగరంలో ఇజ్రాయెల్ఆదివారం జరిపిన దాడులను అగ్రరాజ్యం అమెరికా ఖండించింది. మహిళలు, పిల్లలు సహా పెద్ద ఎత్తున మరణాలు సంభవించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. దాడి దృశ్యాలు కలచివేసేలా ఉన్నాయని, చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదని పేర్కొంది.

'రఫాలో ఇజ్రాయెల్ రక్షణ దళాలు జరిపిన దాడుల్లో పదుల సంఖ్యలో పౌరులు మరణించిన దృశ్యాలు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. అవన్నీ చూస్తుంటే హృదయం తరుక్కుపోతోంది. చాలా భయానకంగా ఉన్నాయి

. హమాస్‌తో జరుగుతున్న ఈ పోరులో సామాన్యు లకు ఎలాంటి హాని జరగొద్దు. హమాస్‌కు బుద్ధిచెప్పే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. అయినప్పటికీ అది సామాన్య పౌరులకు ఎలాంటి ముప్పు తలపెట్టొద్దు. అందుకోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. హమాస్ పెద్ద తలకాయల్ని లక్ష్యంగా చేసుకొని ఈ దాడి జరిగింది. అదే సమయంలో పౌరుల ప్రాణాలు కూడా ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని వైట్‌హౌస్‌లోని జాతీయ భద్రతా మండలి వ్యూహాత్మక సమాచార విభాగం సమన్వయకర్త జాన్ కిర్బీ పేర్కొన్నారు.

రఫాలో భూతల దాడులు అవసరం లేదని తాము భావిస్తున్నామని కిర్బీ అభిప్రాయపడ్డారు. దీనిపై నిరంతరం ఇజ్రాయెల్‌తో చర్చలు జరుపుతున్నామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు. మరోవైపు రఫాలో ఇజ్రాయెల్ దాడి తర్వాత కూడా ఆ దేశం పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విధానంలో ఎలాంటి మార్పు లేదని వైట్‌హౌజ్ స్పష్టం చేసింది. దాంతో ఇజ్రాయెల్ విషయంలో అమెరికా నిర్దేశించుకున్న హద్దులు ఇంకా ఆ దేశం మీరలేదనే విషయం వెల్లడవుతోందని నిపుణులు అంటున్నారు.

రఫాలో ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 45 మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఇప్పటివరకు గాజా పోరులో అత్యంత పాశవికమైన దాడుల్లో ఒకటిగా దీన్ని పేర్కొంటున్నారు. దాడి జరిగిన తల్ అల్ సుల్తాన్ ప్రాంతాన్ని సురక్షితమైనదిగా ఇజ్రాయెలే ప్రకటించింది. దాంతో చాలా మంది ఇక్కడకు వచ్చి తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంపైనే దాడి చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అయినప్పటికీ ఇజ్రాయెల్ దాడుల్లో సోమవారం రాత్రి, మంగళవారం మరో 37 మంది పాలస్తీనీయన్లు మృతి చెందారు.

## కేజ్రీవాల్ బెయిల్ పొడిగింపునకు నో

-వారం రోజులు పొడిగించాలని కోరిన ఢిల్లీ సీఎం
-పిటిషన్ దశలోనే తిరస్కరించిన సుప్రీంకోర్టు
-ముందుగా నిర్దేశించిన సమయానికే లొంగిపోవాలని ఆదేశం
-రెగ్యులర్ బెయిల్ కోసం కింద కోర్టుకు వెళ్లాలని సూచన

న్యూఢిల్లీ, మే 29 :ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అసలు కేజ్రీవాల్ దరఖాస్తును స్వీకరించేందుకు కోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఇచ్చింది. కేజ్రీవాల్ దరఖాస్తు విచారణకు అర్హమైనది కాదని పేర్కొంది.. దీంతో సీఎం కేజ్రీవాల్ జూన్ 2న లొంగిపోవాల్సి ఉంటుంది.

కాగా, ఎన్నికల నేపథ్యంలో మే 10న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోవాలని కోరారు. అయితే అకస్మాత్తుగా ఆరేడు కిలోల బరువు తగ్గినందున అనేక వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్ వ్యవధిని ఏడు రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టును ఆయన అభ్యర్థించారు. దీనిని సుప్రీంకోర్టు ఇవాళ తిరస్కరించింది.

## రెమాల్ తుపాన్ విధ్వంసం .. ఈశాన్య రాష్ట్రాల్లో ఆగం ఆగం..38 మంది మృతి

న్యూఢిల్లీ, మే 29 :బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో సంభవించిన రెమాల్ తుపాను ఈశాన్య రాష్ట్రాల్లోనూ విధ్వంసం సృష్టించింది. తుపాన్ ధాటికి 38మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు.. వేలాదిమంది నిరాశ్రయలయ్యారు.. కాగా, ఐజ్వాల్ జిల్లాలో 27 మంది మరణించారని మిజోరాం ప్రభుత్వం తెలిపింది. ఈ రాష్ట్రంలోని ఐజ్వాల్ జిల్లాలో గ్రానైట్ క్వారీ కూలి 17 మంది చనిపోయారు. మరికొందరు గల్లంతయ్యారు. అలాగే రాష్ట్రంలో వేర్వేరు చోట్ల కొండచరియలు ఇళ్లపై కూలి 10 మంది మృతి చెందగా పలువురు గల్లంతయ్యారు. గ్రానైట్ క్వారీ నుంచి 17 మృతదేహాలను వెలికితీసినట్లు మిజోరం డీజీపీ అనిల్ శుక్లా తెలిపారు. మరో 6, 7 మంది అందులో చిక్కుకున్నట్లు భావిస్తున్నామన్నారు.

భారీ వర్షాలతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోందని, రాష్ట్రంలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని, పలువురు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన మిజోరాం సీఎం సంతాపం వ్యక్తం చేస్తూ పరిహారం ప్రకటించారు. రాష్ట్ర విపత్తు సహాయ నిధికి ముఖ్యమంత్రి రూ.15 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం అందిస్తుందని సమాచార పౌరసంబంధాల శాఖ తెలిపింది.

మేఘాలయలో భారీ వర్షం కారణంగా ఇద్దరు మృతి చెందగా, 500 మందికి పైగా గాయపడ్డారు. తూర్పు జైంతియా హిల్స్‌లో కారు ప్రమాదంలో ఒకరు, తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో మరొకరు మరణించారని అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దాదాపు 17 గ్రామాలకు నష్టం వాటిల్లిందని, చాలా ఇళ్లు దెబ్బతిన్నాయని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ నివేదిక పేర్కొంది.

అసోంలో భారీ వర్షం కారణంగా ముగ్గురు మృతి చెందగా, 17 మంది గాయపడ్డారు. రెమాల్ తుపాను ప్రభావంతో బలమైన గాలులు, భారీ వర్షాల కారణంగా మంగళవారం అసోంలో భారీ నష్టం జరిగింది.

కేరళ రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. దక్షిణ తమిళనాడులో ఏర్పడిన తుపాన్ కారణంగా రెండు రోజుల పాటు కేరళలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. తిరువనంతపురం ముతలాపోజి హార్బర్ ప్రాంతంలో ఒక పడవ బోల్తా పడటంతో అంచుతెంగుకు చెందిన మత్స్యకారుడు అబ్రహం (60) మరణించాడు. ఇడుక్కిలోని మరయూర్ సమీపంలో పాంబర్‌కు చెందిన 57 ఏళ్ల రాజన్ చేపలు పట్టుకుంటున్న సమయంలో నదిలో పడి మరణించాడు. తిరువనంతపురంలోని అరువిక్కరకు చెందిన 56 ఏళ్ల అశోక్, కన్హంగాడ్‌కు చెందిన 14 ఏళ్ల సినాన్, పెరుంబవూరులో 10వ తరగతి విద్యార్థి ఎల్డోన్ నదిలోని మునిగి చనిపోయారు. మావేలికరకు చెందిన 31 ఏళ్ల అరవింద్ కొబ్బరి చెట్టు మీద పడి మరణించాడు. భారీ వర్షాల కారణంగా కొచ్చిలో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. భరణంగానం వద్ద కొండచరియలు విరిగిపడి ఏడు ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసివేశారు.

## రోడ్డు పై అడ్డంగా నిలిచిన వాహనం.. ట్రాఫిక్ ఇక్కట్లు

హైదరాబాద్, మే 29 :: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు బజార్ సమీపన సిద్ధార్థ స్కూల్ ప్రాంతంలో ప్రధాన రోడ్డుపై ఓ డీసీఎం వ్యాన్ అడ్డంగా నిలిపి వాహనదారులకు ఇబ్బందికరంగా మార్చారు. సంబంధించిన డీసీఎం నుండి సంచులలో పదార్థాలను చేరవేస్తు ఉండగా దాదాపు 30 రైతు బజార్ నుండి ఆలంపల్లి వెళ్లేవాళ్లు షార్టుట్లో ఈ మార్గం గుండా వెళ్తుంటారు. సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు కానీ పోలీసులు కానీ ఈ విషయంలో స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు

## బీజేపీ విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, మే 29 : ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఉపాధి కల్పన ఊసే లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ప్రియాంక హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు.విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చిన్న మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. ఈ రంగంలోనే అత్యధిక ఉద్యోగాలు సమకూరుతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఉపాధి కల్పనను పూర్తిగా విస్మరించారని ఆమె ఆరోపించారు. ఈ పరిస్థితిని నివారించేందుకు బీజేపీ విధానాలను మనం మార్చాల్సి ఉందని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. బీజేపీ విధానాలు చిన్న పరిశ్రమలు చితికిపోయేలా ఉన్నాయని అన్నారు. కాషాయ పాలకుల విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం అవుతుంటే బిలియనీర్లు మరింత సంపద పోగేసుకుంటున్నారని ఆమె దుయ్యబట్టారు.

## "టూరిస్ట్ పారడైజ్"గా పేరొందిన గోవా?!

భారతదేశ అరేబియన్ నైరుతి తీరప్రాంత గోవా రాష్ట్రం దక్కన్ పీఠభూమిగా పశ్చిమ కనుమలతో వేరు చేయబడి ఉంది. 'పనాజీ' కేంద్రంగా కోంకన్ అధికారిక భాష మాట్లాడే గోవా ప్రాంతం ప్రకృతి రమణీయతలకు, బీచ్‌ల కమనీయ విందులకు ప్రసిద్ధి గాంచింది. ఉత్తరాన మహారాష్ట్ర, పశ్చిమ, దక్షిణాన కర్నాటక, పశ్చిమాన సముద్ర తీరప్రాంతంగా పర్యాటకులకు స్వర్గతుల్యంగా నిలుస్తున్నది. భారత్ 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్యం పొందినప్పటికీ గోవా మాత్రం పోర్చుగీస్ పాలనలోనే కొనసాగింది.

### ఆపరేషన్ విజయ్‌తో విముక్తం:

450 ఏండ్ల పోర్చుగీస్ పాలన అనంతరం 19 డిసెంబర్ 1961న భారత ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ విజయ్' త్రివిధ దళాల దాడితో 36 గంటల్లోనే డమన్, డయ్యూ ద్వీపాలతో పాటు గోవా కూడా విముక్తమై కేంద్రపాలిత ప్రాంతాలుగా భారత దేశంలో అంతర్భాగం అయ్యాయి. 30 మే 1987న భారత ప్రభుత్వం గోవాకు (25వ రాష్ట్రంగా) రాష్ట్ర హోదాను ఇవ్వడంతో డయ్యూ, డమన్‌లు మాత్రం కేంద్ర పాలిత ప్రాంతాలుగానే మిగిలి పోవలసి వచ్చింది. వైశాల్యంలో అతి చిన్న రాష్ట్రంగా, జనాభాలో నాలుగవ చిన్న రాష్ట్రంగా గోవా అరేబియా సముద్ర ఒడ్డున ఉన్నది. దేశంలోనే అత్యధిక 'పర్ కాపిటా జీడిపి' ( దేశంలో 2.5 రెట్లు అధికంగా) కలిగిన రాష్ట్రంగా గోవా ఉన్నత స్థితిలో ఉంది. ఉన్నత జీవన ప్రమాణాలతో అధిక మౌలిక వసతులు కలిగిన గోవాలో 65 మైళ్ల తీరప్రాంతంతో పాటు అందమైన బీచ్‌లు, విదేశీ పర్యాటకులకు స్వర్గతుల్యంగా ప్రసిద్ధిగాంచింది.

### మతసామరస్యానికి ప్రతీక:

కోంకన్ ప్రాంతంగా పిలువబడే గోవా రాష్ట్రం 30 మే 1987 నుంచి 'రాష్ట్ర అవతరణ దినోత్సవాలను' ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. గోవా ప్రాంతంలో జువారీ, మండోవి, తెరెకోల్, చపోర, గల్గిబాగ్, కుంబర్జువా కెనాల్, తల్పోన, సాల్ అనబడే ఏడు నదులు ప్రవహిస్తున్నాయి. అతి పెద్ద పట్టణంగా వాస్కోడెగామ ఉండగా గోవా రాష్ట్రం రెండు జిల్లాలుగా విస్తరించింది. గోవా రాష్ట్ర జనాభా 15.22 లక్షలు ఉంటుంది. హిందువులు, క్రిస్టియన్లు అధికంగా ఉన్న గోవాలో ముస్లిమ్‌లు, సిక్కులు, జైనులు కూడా కొద్ది జనాభా ఉంది. కోంకణి, మరాటీ, ఆంగ్ల భాష అధికంగా మాట్లాడే గోవాలో వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా ముందుకు దూసుకెలుతున్నది. ఖనిజ సంపద అధికంగా ఉన్న గోవాలో పారిశ్రామిక ప్రగతి కూడా చెప్పుకోదగినదే.

### వైవిధ్య భరితం సాంస్కృతిక వారసత్వం:

కొబ్బరి తోటల నీడన బీచ్‌లు, స్వర్ణమయ ఇసుక తిన్నెలు, ఆకు పచ్చ పరిసరాలు, వైవిధ్య భరిత సాంస్కృతిక వారసత్వ విలక్షణతలు, అద్భుత పురాతన చర్చిలు, దేవాలయాలు, కోటలు, పోర్చుగీస్ కళానైపుణ్య స్మారక కట్టడాలు, తూర్పు-పడమరల సాంస్కృతిక మేలుకలయికలతో గోవా ప్రముఖ రాష్ట్రంగా, 'వరల్డ్ హెరిటేజ్ సైట్'గా కూడా గుర్తించబడి దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నది.

'పర్యాటకుల స్వర్గం'గా కొనియాడబడే గోవా ప్రత్యేకతల్ని ఆస్వాదిస్తూ, ఆధునికత పేరున సాంస్కృతిక విధ్వంసం, వారసత్వ సంపదకు విఘాతం కలుగకుండ కాపాడుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది.

(30 మే 'గోవా రాష్ట్ర అవతరణ దినం' సందర్భంగా)

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ సంయుక్త ఆధ్వర్యంలో....
జాతీయ స్థాయి కథలు, కవితల పోటీలు - 2024

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలు :
- కథ చేతిరాతలో 5 పేజీలకు మించరాదు. డి.టి.పి. చేసినచో 3 పేజీలకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

నిబంధనలు :

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలు :
- కవిత 25 లైన్లకు మించరాదు.
- అంశం : ఏదైనా సామాజికాంశం
- హామీపత్రం విడిగా రాసి, జతచేయాలి.

2024 సంవత్సరానికి గాను "వురిమళ్ల ఫౌండేషన్ - అక్షరాల తోవ" సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కథలు, కవితలు పోటీలు నిర్వహించనున్నారు.

'వురిమళ్ల శ్రీరాములు' స్మారక కథల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 5000/-, ద్వితీయ బహుమతి రూ. 4000/-, తృతీయ బహుమతి రూ. 3000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

'వురిమళ్ల పద్మజ' స్మారక కవితల పోటీలలో ప్రథమ బహుమతి రూ. 4000/-, ద్వితీయ బహుమతి రూ. 3000/-, తృతీయ బహుమతి రూ. 2000/- లతో పాటు రెండు కన్సలేషన్ బహుమతులు 1000/- ల చొప్పున విజేతలకు ఇవ్వబడును.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిలో ఒకరికి "భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ" గార్ల సాహితీ పురస్కారంతో పాటు రూ. 10,000/- నగదు బహుమతి అందజేయబడుతుంది.

కవితలు, కథలు పంపాల్సిన చివరి తేది : 30 జూన్ 2024

కథలు, కవితలు పంపాల్సిన చిరునామా :
రాచమళ్ళ ఉపేందర్, స్టార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతి లాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001. సెల్ : 98492 77968

పూర్తి వివరాలకు : వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు : వురిమళ్ల సునంద, సెల్ : 9441815722

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 30-5-2024

## నరం లేని నాలుక



కూడూ కునుకూ కరువైపోయే
బంధువుల విసుర్లు బరువైపోయే!
ఏ మనసులో ఏ సర్పం వుందో-ః
ఏ క్షణంలో ఏ విషం చిమ్ముతుందో!
ఈటెల్లాంటి చూపులు-
గుండెల్లో గుచ్చుకుంటున్నాయి!
నాలుకకి రంపం తొడిగించినట్లు-
మాటలు గాయం చేస్తున్నాయి!
వ్యంగ్య బాణాలు, వెటకారాలు
నిరంతరం వేధిస్తున్నాయి!
ఆయుధాలకన్నా అతిపదునైన
మాటలనెదుర్కుంటూ నిస్సహాయంగా నేను!!



-ఎన్.విజయా కిషన్ రెడ్డి, 98488 68085

## ఘంటారావం

సమయపాలన పాటించేవారు
పనీపాట లేనివారనుకునేకాలం
పాటించనివారు ప్రముఖులుగా
పొగడ్తలందుకుంటున్న వైనం.

పరువుపోయే పనులు
చేయకు
బరువుగా రాత్రుళ్లు
గడపకు.

విన్నదాన్ని విశ్లేషణ
చేయరు
తీర్పులివ్వడానికి
తయారు.

చరవాణి ద్వారా
క్షణాల్లో చెల్లింపులు
అజాగ్రత్తగా ఉంటే
అక్రమ మళ్ళింపులు.

లోపల
లుకలుకలు
వెలుపల
పకపకలు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## ఏడుకోలల బాయి

ఎదురుగాలులు వీచి ఏమి తోచకపోతె
ఏదో ఓ జిమ్మిక్కు నేయవలయు
కత్తిదీసి మననె ఖతము జేసెడియాట
అదనుగా మనమోటి అల్లవలయు
బట్టగాలిచి మీద బడవేయగలగాలి
ఎదుటోడు ఒకవేళ ఎత్తుకెదగ
లోలోపలంతయూ లోటుగామనకున్న
ఫిర్యాదు జేయాలి పిటిషనేసి

మనమె గెలవాలి నిలవాలి మాయనైన
ఎదుటివాడిని తరమాలి ఎత్తులేసి
ఖర్మగాలిపోయెవడైన గెలిచెనేని
వెంటనే కోర్టు ద్వారాలు తట్టుమనెడు

మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!

వీడు ఆడెడుఆట వాడు పాడెడిపాట
పదుగురాడెడు చిల్క పల్కులన్ని
పొట్టోడి మోసాలు పొడుగోడి వేషాలు
అటు ఇటు గానోళ్ళ అల్పమంత
పెద పార్టి జేసేటి పెడమర్ల పనులన్ని
చిన పార్టి బెట్టేటి చిచ్చులన్ని
అటు గాని ఇటు గాని ఐసతే సరిపోని
ఇండిపెండెంటోని ఇగురమంత.

ఎరిగి ఓటరు నిర్ణయమ్మెట్లు జేయు
ఎంత అధ్యయనమ్మున్న నేమితెలియు
లోకజ్ఞానమ్ము ఎంతుంటె లోతుదెలియు
అంత గడబిడ గంద్రగోళమ్మొకింత.

మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవార! తిక్కలోడ!



-డా॥ఏనుగు నరసింహారెడ్డి 8978869183

## పట్టుదలను విడవకండి

ఇది నాకు ఆశ్చర్యంగా ఉంది
ఇది నాకెప్పుడు తోచనేలేదు
అంతుబట్టని విషయాలు
అనుభవానికి వస్తాయట
ఆలోచనలు భ్రమరాలై
అవనినే ముసురుతాయట
చీకటినవ్వితే
సూర్యుడుదయిస్తాడు
బురద మెరిస్తే
కమలం వికసిస్తుంది
నల్లని రాతిలో
తెల్లని వెంకయ్య దాగున్నాడు
అవసరం వస్తేగాని
ఆకాశంలో ఇంద్రధనుస్సుల జాతర!

అజ్ఞానాన్ని అవమానించడం
అన్నివేళలా తగదు
దానికీ ఒక పట్టుదల ఉంటుంది.
పట్టుదలను విడవకుంటేనే
జ్ఞానోదయం కలుగుతుంది.



- మసన చెన్నప్ప
సెల్:9885654381









స్వాగతం
స్వగతం
ఆహ్వానమై బ్రతుకును వెలిగించునది
బ్రతుకు -గతం
-అంకాల సోమయ్య
దేవరుప్పుల,జనగాం

కాలం
జాలం
నిజం, ఎంతటి వారమైనా తప్పించుకుని
మనజాలం!
-ఆకెళ్ళ సూర్యనారాయణ మూర్తి
హైదరాబాద

సమస్తం
ప్రశస్తం
కాదని స్వార్థంతో విర్రవీగితే సర్వం అస్తవ్యస్తం.
-రావూరి నరేశ్, సఖినేటిపల్లి.

కాదనకు
లేదనకు
అర్థం చేసుకోలేని మూర్ఖులతో దిగకు వాదనకు!
-చంద్రకళ.దీకొండ
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.

పోవాలి
రావాలి
ఆత్మీయంగా మాట్లాడే మనసున్న హృదయం
కావాలి
-జూపూడి హనుమంతరావు
హైదరాబాద్

పికం
మెకం
ఏ జీవికయినా కాకతప్పదు ప్రకృతిలో మమేకం
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

అమ్మాయి
అబ్బాయి
ఇరువురికీ సరి తూగే పదం 'పాపాయి!'
-ఎన్.ఆర్.తపస్వి, చెన్నై

వయస్సు
సదస్సు
గౌరవం పొందడానికి కావలసినది మంచి మనస్సు
-కామేశ్వరి వాడ్రేవు, రాజమహేంద్రవరం

తిట్టడం
నెట్టడం
ఎక్కడైనా తప్పే మనిషిని చెయ్యిచేసుకుని
కొట్టడం.
-భమిడిపాటి వెంకటేశ్వర రావు
హైదరాబాద్.

మనం
జనం
ఆ జనంలో మనముంటేనే మనకెంతో ఘనం
-సి.యస్.రాంబాబు
హైదరాబాదు

పెరుగు
తరుగు
జీవితంలో సుఖదుఃఖాల తీరు అంతేనని ఎరుగు
-శాంతమూర్తి, హైదరాబాద్

కొంత
అంత
అనకుండా ఇతరులకు కూడా ఇవ్వాలి కాస్తంత
-గుండం మోహన్ రెడ్డి,
నర్సాపూర్,మెదక్

స్వగతం
అవగతం
సాహిత్యం ఆస్వాదిస్తే లభించే ఉల్లాసానుభవం
మనోగతం!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ
హైదరాబాదు.

పదం!
పథం!!
మాటకైనా చేతకైనా బాటకైనా ఉండాలి దృక్పథం!!!
-మన్నవ నాగ లలిత శ్రీదేవి
విజయవాడ.

చదువులు
పదవులు
ఏనాడూ చిరునవ్వైనా నవ్వకపోతే ఎందుకా
పెదవులు?
-సి.హెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

వలపు
తలపు
జీవితంలో మలుపుకో సలుపుకో ఇస్తున్న పిలుపు
-ఉపద్రష్ట సుబ్బలక్ష్మి, హైదరాబాద్

అజ్ఞానం
విజ్ఞానం
ఇహలోకమే తామరాకు - నీటిబిందువే మరి
జ్ఞానం
-భానుశ్రీ తిరుమల, విశాఖపట్నం.

అనిపించాలి
వినిపించాలి
చేతలలో నువ్వు అశక్తుడవు కావని నిరూపించాలి.
-అమృతవల్లి. ఎ., ప్రొద్దుటూరు

తాపం
పరితాపం
అడుగడుగునా ఎదురయే కష్టాలపై కోపం
-రావెల పురుషోత్తమరావు, అమెరికా

పనిమంతుడు
గుణవంతుడు
రెండూ కలిగిన - నాడే రాణించు విద్యావంతుడు
-అల్లంరాజు రాధాకుమార్ (రాధాయి)
అగమ్ నగర్ ,హైదరాబాదు

ఖగోళం
భూగోళం
మనిషి..భ్రమణం డబ్బుకోసం ఒకటే గందరగోళం.
-పి.బాలా త్రిపుర సుందరి
హైదరాబాద్

అరుగు
సొరుగు
పల్లెటూరి సౌందర్యం అవుతోంది నేడు కనుమరుగు.
-నాగరాజు.చుండూరి
లండన్

వెలిగించు
తొలగించు
విజ్ఞాన కాంతులలో జగానికి మేలు కలిగించు.
-సింహాద్రి వాణి, విజయవాడ

వస్తాయి
పోతాయి
అహంకారం నశించినప్పుడు అన్ని కష్టాలూ
సమసిపోతాయి
-గందె శోభారాణి
చందానగర్,హైదరాబాదు

చిత్తు
బొత్తు
జీవితంలో ఎవరికీ కాబోకు బానిస తొత్తు.. !!
-జి.కె.నారాయణ (లక్ష్మిశ్రీ)
జోగులాంబ గద్వాల్ జిల్లా

అనుమానం
అవమానం
ఏది ఎదురైనా విడువకోయీ ఎన్నడూ
స్వాభిమానం!
-యన్.కే. నాగేశ్వరరావు, పెనుగొండ.

బాధ
గాధ
ప్రతీ ఒక్కరి జీవితం ఒక వ్యధ
-రహంతుల్లా, కర్నూల్

నిత్యము
సత్యము
అసత్యం , అన్యాయం చలామణియే నేటి
నిత్యకృత్యము!!!..
-త్రిలోచన్ బిసాయి, కుసుంపురం...

ఆలన
లాలన
వాగ్దానాల మేరకు కార్యనిర్వహణే సరైన పాలన
-డా॥ చిట్యాల రవీందర్, హైదరాబాద్

# మద్దాళి సందర్భోచిత కవిత్వం

మద్దాళి రఘురామ్ వెలువరిస్తున్న నాలుగవ కవిత్వ పొత్తం "అమ్మా! భారతీ! వందనం". యిది వరలో వెన్నెల కన్నీరు, తూకానికి కన్నీళ్ళు, అక్షరాల కన్నీరు పేరిట కవితా సంపుటాలు రచించిన అనుభవజ్ఞుడు రఘురామ్. ఈయన పేరు చెప్పగానే "కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్" సాంస్కృతిక సంస్థ గుర్తుకొస్తుంది. నాలుగు దశాబ్దాలుగా వందలకొద్ది సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్న కిన్నెర రఘురామ్‌గా స్ఫురిస్తారు. 'కిన్నెర పబ్లికేషన్స్'" స్థాపించి యిప్పటివరకు 130 గ్రంథాలు ప్రచురించిన రఘురామ్ తనే స్వయంగా రాసిన పది గ్రంథాలను పాఠకులకు అందించారు. ఆయన సహధర్మచారిణి ఉషాగాయత్రి ప్రసిద్ధ కూచిపూడి నృత్య కళాకారిణి. 'నృత్య కిన్నెర'సంస్థ ద్వారా ఎంతో మందికి నాట్యకళలో శిక్షణ నిస్తున్న నాట్య గురువు. నృత్యం, సాహిత్యం పెనవేసుకున్న ఆత్మీయ బంధం ఈ దంపతులది.

తను సాధించిన విజయాల వెనక వెన్నంటి నిలిచిన అర్ధాంగికి ఈ తాజా కవితా సంపుటిని అంకితం గావించి, తొలి ప్రతిని తన మాతృమూర్తి పాద పద్మాలకు సమర్పించిన సంస్కారవంతుడు రఘురామ్.

'అమ్మా భారతీ! వందనం!" శీర్షికన సృజించిన కవితలో ఒక స్వాతంత్ర్య సమరయోధుని ఇల్లాలు దేశమాత దాస్య శృంఖలాలు తెంచే మహా యజ్ఞంలో తన నూరేళ్ళ సంసారం నాలుగేళ్ళకే సమిధగా ముగిసిపోయిన ఆవేదనను కడు హృద్యంగా దృశ్యమానం గావిస్తారు రఘురామ్.

**"ఉదయించే సూర్యునిలా**
**ఎగసిపడ్డ ఉద్యమకారుడు పతిదేవుడు**






ప్రతులకు:
కిన్నెర పబ్లికేషన్స్
ఫ్లాట్ నెం.101,
మద్దాళి గోల్డెన్ నెస్ట్,
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,
బాగ్ అంబర్‌పేట
హైదరాబాద్-500 013.
సెల్: 9866057777

**తెల్లవాడి దాష్టికానికి బలైన**
**విగతజీవుడు"** అంతే కాదు..
**"నేను కన్న కవల పిల్లలు**
**వీర జవానులయ్యారు**
**మాతృభూమి రక్షణలో**
**కార్గిల్ యుద్ధంలో**
**ముష్కరుల చేతిలో**
**అమరులయ్యారు**
**మా ఇంట మొలకెత్తనున్న**
**మరో వంశాంకురం మొక్కై**
**ఎదగాలి**
**నీ మొక్క పూసే పువ్వు**
**నీ పూజలో పరిమళించాలి**
**ఈ జన్మ.. నీ ఈసేవలో**
**తరించాలి"** ఆవేదన, త్యాగ చింతన కలబోసిన రచన. మిగిలిన 26 కవితలు సందర్భానుసారం రాసినవి. విశిష్ట వ్యక్తుల గురించి, శతజయంతి మూర్తుల గురించి రాసిన కవితలు.

'యువ కళావాహిని' సాంస్కృతిక సంస్థాధినేత కీ॥శే॥ వై.కె. నాగేశ్వరరావును
**"ఒక గౌతమ బుద్ధుడిని**
**స్వామీ వివేకానందుడ్ని**
**సమ్రాట్ అశోకుడ్ని**
**సజీవ శిల్పాలుగా మలిచి**
**రంగస్థలంపైన నిలిపినవాడు**
**కళల రహదారుల్లో**
**మనం నడక మొదలు**
**పెట్టినప్పుడు**
**అతడు.. సరిహద్దు దాటించ**
**గలిగిన**
**సాంస్కృతిక సారధి"**గా స్మరించుకుంటాడు.

**"కూచిపూడి నాట్య విన్యాసానికి**
**రెండోపేరుగా చెలామణి**
**జవజీవాన్ని నృత్యశైలికి**
**నృత్య చూడామణి"** అంటు ప్రఖ్యాత నాట్యకళాకారిణి శోభానాయుడిని కీర్తిస్తాడు.

**"పాటకైనా.. మాటకైనా**
**నీది ఆచార్య ముద్ర"** అంటు ఆచార్య ఆత్రేయను గుర్తుకు తెస్తాడు.

ప్రముఖ కథకుడు కాళీపట్నం రామారావు పేరు చెప్పగానే ఆయన నెలకొల్పిన 'కథానిలయం' గుర్తుకొస్తుంది.. **'కథా నిలయం ఆయన నాటిన విత్తనం"** అన్నది అక్షర సత్యం.

రాచకొండ విశ్వనాథ శాస్త్రిని 'తెలుగు కథల కొండ''గా అభివర్ణించడం బాగుంది.

**"రాజశేఖర చరిత్రను**
**తెలుగు సాహితీలోకానికి**
**కానుకచేసి**
**తొట్ట తొలి నవలాకారుడైన"**
కందుకూరి వీరేశలింగంను నవయుగ నిర్మాతగా వర్ణిస్తు నివాళులర్పిస్తారు రఘురామ్.

**"అక్షరానికి తలకట్టు**
**సినారె పంచెకట్టు**
**గడియారం ముళ్ళను కూడా**
**మీ సమయ పాలన హెచ్చరిస్తుంది**
**తూకం వేసిన మాట**
**అక్షరాలు కూడా తమను**
**సరిచూసుకునే బాట"** మహాకవి డా॥సి. నారాయణరెడ్డిని ఎరిగిన వారు మద్దాళి రఘురామ్‌తో ఏకీభవించక మానరు.

**''ఆంధ్ర నాట్యం, పేరిణి, నవజనార్ధనం**
**మూడు నర్తనాంశాల సంగమం**
**మీరు నాట్యకళా త్రివేణి"** అంటు నాట్యకళా ప్రపూర్ణుడు నటరాజ రామకృష్ణకు అక్షరార్చన గావిస్తారు.

యిలా సింహభాగం కవితలు మహామహుల జయంతుల సందర్భంగా నివాళులర్పిస్తు రాసిన కవితలే.

**'ఉగాది'** పండుగ అంటే మద్దాళికి అమిత యిష్టం. శుభాలిచ్చే ఉగాదికి స్వాగతం పలుకుతు కవితలల్లారు. ఆరోజు రఘురామ్ పుట్టిన రోజు కూడా.

**'నా పుట్టిన రోజు సంబరాన్ని**
**ఉగాదికి కూడా పంచుతాను"**
అంటు సెలబ్రేట్ చేసుకుంటారు రఘురామ్.

**"తోబుట్టువు ముందు చూపు"** హృద్యమైన స్మృతి కవిత (ఎలిజీ). తన చెల్లెలు అకారణ మరణం పొందిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటు గుండె లోతుల్లోంచి ఎగిసిపడ్డ దుఃఖ కెరటం యిది.

**"నువ్వు చెల్లెవా? తల్లివా?**
**అనురాగం పంచి ఇచ్చినప్పుడు**
**చెల్లెలా అనిపిస్తావు**
**ప్రేమను కురిపించినప్పుడు**
**తల్లిలా అనిపిస్తావు**
**మనసులేని కాలం**
**నిన్ను కాలసర్పమై వెంటాడింది**
**కరోనా పేరుతో యమపాశాన్ని**
**విసిరింది.**
**చెల్లీ! నా బంగారు తల్లీ!**
**కంటి కొసలలో నిలిచిన**
**రెండు కన్నీటి బిందువుల్ని**
**నివాళిగా మలుస్తున్నాను"**
పాఠకుల గుండెల్ని పిండివేసే కవిత!

సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో క్షణం తీరికలేకుండా గడిపే మద్దాళి రఘురామ్ కవిత్వ సృజనకు కూడా కొంత సమయం కేటాయించి ముమ్ముందు మరింత మంచి కవిత్వం వెలువరిస్తాడని నా నమ్మకం.



-రమణ వెలమకన్ని
సెల్: 98660 15040.

పుస్తక సమీక్షలు

# ప్రకృతి-వికృతిగా మారిన వేళ...

'విశ్వశ్రేయః కావ్యం' అన్నది ఆర్యోక్తి. 'శ్రేయస్సు' అంటే అది భౌతికమైనది. మానసికమైనది - ఆధ్యాత్మికమైనదీ కూడాను. కావ్యం అందించే శ్రేయస్సు ప్రతీ నాగరిక సమాజంలో ప్రతిఫలిస్తుంది. వందల ఏండ్ల చరిత్రగల తెలుగు కావ్యం వినూత్న వస్తువులతో విచిత్ర శైలులతో కొనసాగుతోంది.

21వ శతాబ్దంలో కవిత్వ వ్యాసార్థం పెరిగింది. కావ్యం పరిధీ పెరిగింది. ప్రకృతిలోని సౌందర్యాన్ని మానవీకరించడం, మానవ సౌందర్యాన్ని ప్రకృతీకరించడం వంటి ప్రయోగాలు కవిత్వంలో ఎన్నో చూశాం. అయితే ప్రకృతిని వికృతిగా మార్చే మానవస్వభావాన్ని కవితా వస్తువుగా సుదీర్ఘ వచన కవిత్వాన్ని డా॥పి. విజయలక్ష్మి పండిట్‌గారు మనముందుకు తెచ్చారు. 'పుడమ తల్లి' గొంతెత్తి ఆర్తిగా వినిపించే భావజాలాన్ని అక్షరీకరించారు.






ప్రతులకు:
-డా॥పి. విజయలక్ష్మి పండిట్
ఇ.నెం.3-6-361/ఎ
హిమాయత్‌నగర్, స్ట్రీట్ నెం.20
హైదరాబాద్-500 029.
సెల్: 86390 61472

భూమి స్త్రీమూర్తి, నవగ్రహాలలో స్త్రీతత్వం ఉన్నది భూమికే. ఆమె జనని. తల్లిని. గౌరవించలేని జాతి ఏనాటికీ నాగరిక జాతికాదు. ప్రపంచంలో దుర్మార్గమైన కొడుకులు, కూతుళ్ళు ఉండవచ్చు కానీ దుర్మార్గమైన తల్లి ఉండదు.

"కుపుత్రో జాంకుతత్ కృచితపికు మాతాన భవతి'' అని ఆది శంకరాచార్యులు దేవీ అపరాధక్షమీవణ స్తోత్రంలో చెపుతారు.

పుడమి మన తల్లి. తల్లి అనగానే మనం పులకరించాలి. పూర్వం నిద్రలేవగానే కాలు నేల మీద పెట్టేపుడు భూమికి నమస్కరించే సంప్రదాయం భారతదేశంలో ఉంది.

"సముద్రవసనేదేవీ పర్వతస్తన మండతే..'' అంటూ పాదం నీపై మోపుతున్నందుకు క్షమించమ్మ అని ప్రార్థించేవాళ్ళం. అంతగాదు నేలమీది గట్టు, చెట్టు, పుట్ట, నది, సముద్రం, ఎగిరే పక్షి, తిరిగే జంతువుల ఏదైనా సరే మానవునికి సేవలందించే ప్రతి చరాచరవస్తువులను తల్లిలాగానో, చెల్లిలాగానో, దైవంలాగానో భావించే జాతిమనది. అత్యంతనాగరిక జాతుల లోనే తలమానికమైన జాతి మనది.

కానీ స్వార్థం తలకెక్కి తల్లితనాన్ని, చెల్లితనాన్ని, దైవత్వాన్ని గుర్తించే స్థితిలో ఆధునిక మానవుడు లేడు, ఆ దునదృష్టస్థితిని గుర్తుపట్టిన ఆధునిక కవయిత్రి డా॥ విజయలక్ష్మి పండిట్.

వృత్తిరీత్యా జీవశాస్త్రం బోధించే ఈ కవయిత్రి శాస్త్రాన్ని కవిత్వాన్ని సమపాళ్ళలో మేళవించి రచించిన కావ్యం 'ధరిత్రీ విలాపం'. గహనమైన జీవ, రసాయనిక, భౌగోళిక రహస్యాలను తేట తెలుగులో సూటిగా కవిత్రీకరించిన శైలి బావుంది. నేటి యువతరానికి అర్థమయ్యేలా విషయాలను చెప్పడం ముచ్చటేస్తుంది. కవిత్వం పాలు ఎక్కువ కాకుండా, అలా అని శాస్త్రంపాలు తక్కువ కాకుండా రెండింటినీ తన హృదయ తూలదండంపై తులతూగి స్తూ రచించిన పర్యావరణ గీతమిది. హృదయంగమి పర్యావరణ సంగీత మిది.

(డా॥ పి. విజయలక్ష్మి పండిట్ రచన ధరిత్రి విలావం''పై డా॥రాళ్ళబండి కవితా ప్రసాద్ రాసిన ముందు మాట ఇది..)

## డా॥ నలిమెల భాస్కర్‌కు, ఆచార్య శలాక రగునాథ శర్మలకు
# ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం





డా॥ నలిమెల భాస్కర్‌కు, ఆచార్య శలాక రఘునాథశర్మలకు ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి. చిత్రంలో కె. శ్రీనివాస్, వెల్చాల కొండలరావు, రామచంద్రమూర్తి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు.

హైదరాబాద్, మే 29 : (నేటినిజం ప్రతినిధి): ఆచార్య రవ్వా శ్రీహరికి వ్యాకరణం, నిఘంటు నిర్మాణం రెండు కళ్లు. కనుకనే ఆ మహా మహోపాధ్యాయుని స్మారక జీవన సాఫల్య పురస్కారాలను సంస్కృత భాషా సాహిత్య పరిశోధనా రంగంలో విశేష కృషి చేసిన ఆచార్య శలాక రఘునాథశర్మకు తెలంగాణ పదకోశ రూపకర్త నలిమెల భాస్కర్‌కు ఇవ్వడం ముదావహమని వక్తలు కొనియాడారు. పాణినీయ 'అష్టాధ్యాయి' సంస్కృత వ్యాకరణ గ్రంథాన్ని 2 వేల పేజీల్లో తెలుగులోకి అనువదించిన మహా పండితుడు శ్రీహరి అంటూ సంస్కృతాంధ్ర భాషలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొన్నారు. ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. తూము రామదాసు కవి పద్య నిఘంటువుకు తత్సమేతకర శబ్దాలతో రవ్వా శ్రీహరి కూర్చిన అచ్చ తెలుగు పర్యాపద నిఘంటువు 'ఆంధ్రపద నిధానం'ను వక్తలు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్, నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సంస్కృత కావ్యాలను తెనుగీకరించడం సాధారణమనీ, అందుకు భిన్నంగా తెలుగు కావ్యాలను సంస్కృతంలోకి అనువదించిన గొప్ప పండితుడు రవ్వా శ్రీహరి అని కొనియాడారు. అముద్రితంగా ఉన్న రవ్వా శ్రీహరి నిర్మించిన ఈ ఏడో నిఘంటువును ఆయన మరణానంతరం ప్రచురించిన ఆయన ముగ్గురు కుమారులను అభినందించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్కృత వ్యాకరణవేత్త అయిన రవ్వా శ్రీహరి సాహిత్య సృజనలో అట్టడుగు ప్రజల భాషకూ ప్రాధాన్యత ఇచ్చారన్నారు. స్థానిక ప్రాంతీయ అభివ్యక్తి ఆయన కృషిలో కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు అకాడమీ పూర్వ సంచాలకుడు కె.యాదగిరి సభాధ్యక్షత వహించారు. ప్రముఖ సాహిత్య పరిశోధకుడు శ్రీరంగాచార్య, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు వెల్చాల కొండలరావు, సంస్కృత పండితులు ఆచార్య ఏ. రాములు, భాగవతం రామారావు, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, పరిషత్ కార్యదర్శి అప్పంపాండయ్య, రవ్వా శ్రీహరి భార్య అనంతలక్ష్మి, కుమారుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రవ్వా శ్రీహరి ఏడో నిఘంటువు 'ఆంధ్రపద విధానం'ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, వెల్చాల కొండలరావు, ఆచార్య శలాక రఘునాథశర్మ, నలిమెల భాస్కర్ తదితరులు.

## సునందామృతం
### తాల సర్ప న్యాయము

తాలము అంటే తాడి చెట్టు. సర్పము అంటే పాము.

తాడి చెట్టు పైకి పాకే పామును ఇతరులు చంపవలసిన అవసరం లేకుండానే ఒళ్ళంతా చీరుకుని పోయి తనంత తానే చనిపోతుంది.

దీనినే మనుషులకు వర్తింప చేసి చూద్దాం.కొందరు ఇతరులకు హానీ చేయాలని చేసే ప్రయత్నంలో తమకే హాని చేసుకుంటారు. అంటే స్వయంకృతాపరాధం అన్న మాట. దీనినే తెలుగులో తాము తీసిన గోతిలో తామే పడటం ' అంటాం.

ఓ కాకి ఎక్కడ గూడు కట్టుకుని గుడ్లను పెట్టినా ఆ పరిసరాల్లో ఉన్న ఓ పాము కాకి మేతకు వెళ్ళగానే పాక్కుంటూ వెళ్ళి గుడ్లను తినేస్తూ ఉంది.

పాము నుంచి తన గుడ్లను కాపాడుకునేందుకు అది తాడిచెట్టు కొమ్మల మధ్య గూడు కట్టుకుని అక్కడ గుడ్లను పెడుతుంది.

అది చూసిన పాము ఆ గుడ్లను తినడం కోసం తాటి చెట్టుపై పాకుతూ వెళుతోంది. తాటి చెట్టు కాండం కొంచెం గరకు గరకుగా ఉంటుంది. పాము మెత్తని శరీరమంతా ఆ గరకుకు గీరుకు పోయి అది కాకి గూటికి చేరకుండానే చనిపోయింది.

అంటే ఇతరులకు హానీ చేయాలని చూస్తే తనకే హానీ కలుగుతుంది అనే అర్థంతో ఈ తాల సర్ప న్యాయమును ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఈ న్యాయమునకు దగ్గరగా మహాభారతంలో కౌరవుల పతనం స్వయంకృతాపరాధం వల్లే జరిగిందని భారతం చదివిన విన్న ప్రతి వారికీ అర్థం అవుతుంది.

వాళ్ళు ఎప్పుడూ పాండవులను తమకు ఆగర్భ శత్రువులుగా భావించి నిరంతరం వాళ్ళను పతనం చేయడానికి కంకణం కట్టుకున్నారు. బాల్యంలోనే ఎప్పుడైతే పాండవులు అందరి అభిమానాన్ని చూరగొనడం మొదలైందో అప్పటి నుండి వారిపై కక్ష పెంచుకున్నారు.అప్పటి నుండి శకుని సాయంతో రకరకాల కుయుక్తులు పన్నారు.

మోసంతో కూడిన జూదం, వనవాసం, అజ్ఞాత వాసం, కురుక్షేత్ర సంగ్రామం.. ఇవన్నీ నిరంతరం పాండవుల పతనానికి ప్రయత్నించి చివరికి నామ రూపాలు లేకుండా పోయారు.

ఇలా అన్యాయంగా అపకారం తలపెట్టే వారు ఏనాటికైనా తాము తీసుకున్న గోతిలో తాము పడి దారుణమైన శిక్షకు గురి కాక తప్పదు.

కాబట్టి తాల సర్ప న్యాయమును గమనంలో పెట్టుకుని అపకారికైనా ఉపకారం చేయాలి.



-పురిమళ్ల సునంద
9441815722

# యుద్ధ గీతం
## దీర్ఘ కవిత




సిరిసిల్లా గఫూర్ శిక్షక్ ఇప్పటి వరకు 4 కవితా సంపుటాలు, 4 పాటల పుస్తకాలు, 7 పాటల సీ.డీ.లతో పాటు తన సంపాదకత్వంలో మరో 7 పుస్తకాలు వెలువడ్డాయి.

**జూన్ 1 శనివారం కామారెడ్డిలోని కర్షక్ బి.ఇ.డి. కళాశాలలో 'యుద్ధగీతం' దీర్ఘ కవిత ఎన్నీల ముచ్చట్లు ఉగాది కవితా సంకలనం 'కవన సమీరాలు' ఆవిష్కరణ సందర్భంగా 'యుద్ధగీతం' దీర్ఘ కవితను నేటినిజం పాఠకుల కోసం యధావిధిగా ప్రచురిస్తున్నాం.**

-సంపాదకులు

అరణ్యం విచ్చుకుంటుంది
ఆయుధం రాపిడి పెడుతుంది
జనం కన్నీళ్ళు తుడ్వడానికి
పోరాటం
తూర్పున ఉదయిస్తుంది.

ఆకాశం అనంతమవుతుంది
అంచుల్లో నక్షత్రాలు మెరుస్తాయి
వెన్నెల అగ్నిని కురుస్తుంది
చుక్కలు పోరుపాటను

పాడుతాయి.

సామాన్యుని దారి కన్నీటి ధార
కలల అడుగు
ఆకలి తీర్చని వ్యధ
రాత్రి చీకట్లో
కన్నుల నుండి కన్నీళ్ళు
రాలుతున్న శబ్దం
దగ దగా మెరిసే నక్షత్రం
నల్లటి ఆకాశమయ్యింది.

కుట్రలు, కుతంత్రాలు, స్వార్థాలు
నేలపైన మోసాలు, విద్వేషాలు
దగా పడిన సాగర కెరటం
ఉప్పొంగుతుంది

ఓడిపోవడం అంగీకారం కాదు
తలవంచడాలు,
రాజీ పడడాలు లేవు
సూర్యుడు ఇప్పుడు
సామాన్యుని పిడికిలిలో
వెలుస్తాడు
పోరాటం తూర్పున
ఉదయిస్తుంది.
×××
వెన్నెలను అందుకుందామని
చందమామ దగ్గరికెళ్ళాను
చంద్రుడు సాగరంలో
మునిగి తేలుతున్నాడు.

కెరటాలలో కాలుపెట్టి
ఆకాశం వంక చూశాను
ఆకాశం చిన్నబోయినట్టుగా
అలిగి కూర్చున్నది
చీకటి అలుముకున్న ఆకాశంలో
నక్షత్రాలు మెరవడం లేదు

మనసు అమావాస్య
జనం గుండెల్లో చీకట్లు
కెరటాలు వలస వచ్చినట్టు
జనం కన్నులు చెబుతున్నాయి.

సాగర అందాలలో కవిత్వ పడవ
కదిలి వెళుతూ ఉంది.

సరిగమ సంగీతం
అశ్రుగీతంగా మారింది
అశ్రువులకు కొత్త
సంగీతం అవసరం.

భయంకరమైన చీకట్లు
గుడ్లగూబల అరుపులు
కెరటాల చప్పుడు మారింది
చినుకుల సవ్వడి మారింది.

వరద కంఠం మారింది
అడవి దు:ఖం
నగర దు:ఖమయ్యింది
విషాదం అర్థం మారిపోయింది.
ఆనందం కాగితం పూలయ్యాయి
నవ్వు కల్పితమయ్యింది
ఇప్పుడు
సరికొత్త సంగీతం
చీకటి రాత్రికి
పర్యాయపదంగా రావాలి.
సాగర అందాలలో కవిత్వ పడవ
కదిలి వెళుతూ ఉంది.
×××
ఏదో ఆత్మీయ పిలుపు
మనసుకు దగ్గరగా
మదిలో సుతిమెత్తని
భావాల బీజాలు వేస్తూ
తెలియని జ్ఞాపకాల వీధుల్లో
చల్లని స్పర్శగా తాకి
నను తీసుకెళుతూ
కాలాన్ని మరిచి
నాతో కవాతు చేస్తు
సుదూర పయనాన్ని
క్షణ క్షణంగా మారుస్తూ

అక్కడంతా
మనసుల్ని మనసులతో
పంచుకుంటున్నారు
అదొక ప్రేమదేశం
స్వార్థాల కుబుసాలు వీడిన
మనసు రాజ్యమది
కోమల మృదు మధుర
స్వరనాద సంగీత
స్వేచ్ఛా నిలయమది
అక్కడ
చైతన్యాన్ని ఒంటినిండా
పూసుకుంటున్నారు
తాగే సుధానీటిలో
ఆస్వాదించే చల్లని గాలిలో
ఆనందం నిండిన
ఆ మేనుల్లోని
ప్రతి కంటిలోచైతన్యం
చైతన్య కేతనాలై కొమ్మలు
ఊపిరి పోస్తున్నాయక్కడ
స్వార్థ మబ్బుల్ని చీల్చుకుంటు
న్యాయ చంద్రుడు
ప్రేమ వెన్నెలను
కురిపిస్తున్నాడక్కడ
బాధల గొడుగులు పక్కనపెట్టి
బాధ్యతగా వెన్నెల్లో
మేనులు
తడిసి ముద్దవుతున్నాయక్కడ
అక్కడ ఆశలు, ఆశయాలు
జీవం పోసుకుంటున్నాయి
అక్కడ బంధాలు, అనుబంధాలు
పూచిన
సౌరభాలవుతున్నాయి
చైతన్యం గాలినిండా
నిండిందక్కడ
చైతన్యం ప్రతి శ్వాస
పిలుస్తున్నదక్కడ
రా...
నువ్వు... రా...
ఆ పిలుపు నీకూ...
వినిపిస్తున్నది కదూ...
ఆ సౌరభాలు నీకు
ఇంపే కదూ...
వీచే ఆ చైతన్య గాలిని
ఒంటి నిండా నింపుకుందాం
పదా...
బాధలన్నీ తీర్చేందుకు
యుద్ధ గీతం రాద్దాం పదా...
×××
అప్పుడు తోట నాకు
జోల పాట పాడేది

పచ్చని ఆకుల
చిరు సంగీతం మధ్య
నా జీవన అమావాస్యను
మరిపించేది.
అప్పుడు
వెన్నెల నా ముందు
నాట్యం చేసేది
పూలన్నీ స్వాగత
గీతికలయ్యేవి
చెట్లన్నీ నా రాకను
గానం చేసేవి.
అప్పుడు నేను
పాటనయ్యేవాన్ని
చరణాలు, పల్లవికి తోడుగా
ప్రవహించి పోయేవాన్ని
ఇప్పుడు
హాయి లేని చల్లగాలి
ఉబికి వచ్చే పొగలను
చూపిస్తున్నది
వాసన లేని గడ్డి పూల మొఖాలు
వాడిపోయాయి
ఎండిన భూమి
తన పగుళ్ళను చూపిస్తున్నది
చెట్లన్నీ
కాపలాదారుల వ్యధలను
పాటలుగా రాయమంటున్నది.

ప్రతి చరణం పల్లవిలో
కష్టజీవి బాధల పాటలు
కన్నీటి దృశ్యమై
కనుల ముందు కదలాడుతున్నవి.

వ్యధల గాధల రాతలో
కలం సాగుతున్నది.

కష్టజీవి బతుకు
చిందర వందర
రైతు బతుకు
అగమ్యగోచరం
సామాన్యుడి బతుకు విల విల.
తీయటి మాటలు
కడుపు నింపడం లేదు.

బతుకునిచ్చే దారి
యువతకు కనిపించడం లేదు

కన్నీళ్ళు తుడ్చేవారు కరువు
చిరు దీపం పెట్టే

యువత లక్ష్యం కరువు.

అమావాస్య చీకట్లు
కమ్ముకున్న పల్లెలు.

మాటల మధురిమ కింద
తేనెటీగలు కనిపిస్తున్న బాధ
అందరూ ఆపద్బాంధవులే
అందరూ ప్రజా రక్షకులే
చీకట్లో చిరుదీపం మాటేమిటి?

సాగర అందాలలో కవిత్వ పడవ
కదిలి వెళుతూనే ఉంది.
×××
ఒక వెలుగు నా గుండెలో ఉంది
అది ప్రశ్న వెలుగు
ధిక్కరణ వెలుగు
నిశ్శబ్దం ఆవరించవచ్చు.

శబ్దం లేకపోవచ్చు
నినాదం రాజీపడవచ్చు
ఆయుధం దారి తప్పవచ్చు
సిద్ధాంతం నిద్దురపోవచ్చు

నిరాశ నింగినిండా
ఆశ, కొన ఊపిరితో ఉండవచ్చు
దేశమంటే మట్టికాదు, జనం
ఎవరు జనం?.

ప్రశ్నించే వారు, ధిక్కరించేవారు
పోరాడేవారు, ఒక్కటయ్యేవారు.

పాలకులు విడదీస్తారు
జనం విడిపోరు
పాలకులు చీకటిని ఉసిగొల్పుతారు
జనం వెలుగుకై పోరాడుతారు.

సామాన్యుడు చీకట్లో నక్షత్రం
దేశానికి వెలుగు దివ్వె
శ్రమైక జీవన సౌందర్యమతడు
సామాన్యుడే వీరుడు.

సంపద అంతా అతనిదే
శ్రమ పడేది అతడే
దేశాన్ని నడిపేది అతడే.

రాజకీయం తెలియదు
కవిత్వం సాహిత్యం తెలియదు
అతడు అందరివాడు
అతడే నిజమైన వారసుడు
దేశ ఓటరు.

ఆకాశం ఎత్తు
ఎగరడం తెలియదు
సాగరం లోతు
ఈదడం తెలియదు.

పంటపైరు తెలుసు
మనిషి మనసు తెలుసు
మంచి తెలుసు
మేలు చేయడం తెలుసు.

మోసం తెలియనివాడు
అతడు దు:ఖంలో ఉన్నాడు
కన్నీళ్ళు కార్చి కార్చి
భూమి తడిసిపోతున్నది.

దేశంలో లక్షల కోట్ల సంపద
కొందరి హస్తాలలో
దోపిడీ జెండా ఎగరేస్తున్నది
దోపిడీ సామ్రాజ్యంలో
అతడు
మర్రి చెట్టు నీడలో
మల్లె తీగ

సువాసనలు ఇవ్వడం
సుగంధం చల్లడమే
తెలిసినవాడు
కన్నీళ్ళు తెలిసినవాడు
అతడి మనసు అమావాస్య.

మనసు ఆకాశమే కానీ
నక్షత్రాలు మెరవవు
అంతా చీకటి.

వెన్నెల మర్చిపోయినవాడు
వెలుగు దరి చేరనివాడు

సూర్యుడు ఒక్కడే
రేపటి ఉదయానికి
నాంది అని
ఆశతో ఉన్నవాడు
అతడే
నేటి సామాన్యుడు.

నిరాశ ఆవరించవచ్చు
నింగినిండా చీకటి అలుముకోవచ్చు
నిశ్శబ్దం గూడు కట్టుకోవచ్చు
×××
నిరాశలో ఆకాశముంది
నిరాశలో తుర్పువెలుగు
తొంగి చూస్తుంది

రేపటి ఉదయంపై
ఆశ ఉంది
రేపు జనాలదే అనే
నమ్మకముంది
రేపు చీకట్లో
నక్షత్రాలు మెరుస్తాయి
వాన జల్లులతో
పచ్చదనం కురుస్తుంది
సామాన్యుడి గుండె చిగురిస్తుంది.

సామాన్యునికి
అనువుగా లేదు
చిరుగాలి సంగీతంలా
వెన్నెల పాటలా
సూర్యోదయం కాంతిలా
మన దేశమిపుడు లేదు
మన దేశమిపుడు
మండుతున్న అగ్ని గుండం

చూపులోపం కాదు
నా గుండె దండోరా కాదు
నా మనసు చీకటి కాదు

మన దేశమిపుడు
ముళ్ళతోటలా, రాళ్ళకుప్పలా
బురద గుంటలా రక్తదారిలా
దారి తప్పిన అడవిలా ఉంది

మన దేశమిపుడు
నవధాన్యాల సంతకాదు
బంగారం పంటకాదు
పెళ్ళిపందిరి పాటకాదు
పొంగిన సముద్రంలా ఉంది
మతాల చిచ్చులో అవినీతి ఉచ్చులో
విద్వేషాల అగ్నిలో, ఆకలిమంటలో
నిరుద్యోగ నిరాశలో,
మత్తుల మాయాజాలంలో
దౌర్జన్యాల ఊబిలో,
కారే రక్తపు ఏరులో
గద్దల ఆకాశం లా ఉంది
లేడి చిమ్మిన నెత్తురులా ఉంది

వర్తమాన భారతంలో
అభిమన్యు లెవరూ లేరు
మైదానంలో పారిపోయే పిల్లలే
అరణ్యంలో ఉన్నారేమో కానీ
అదొక పద్మ వ్యూహం
చొచ్చుక పోయే వారే కానీ
బయటకు రాలేక పోతున్నారు

అది
శత్రువు అల్లిన పద్మ వ్యూహం
గజిబిజి గా ఉంది
వర్తమాన భారతంలో
శత్రువు లెవరు?

ఏలుతున్న ప్రజాస్వామ్య రాజులు
దోపిడీ మాయగాళ్ళు
భారతాన్ని చీకటి చేసిన దొంగలు
మతం మత్తు జల్లి
మాయ చేస్తున్న
దోపిడీ దారులు
జనం అమాయకులు
ఏ నదిలో
కొట్టుకు పోతున్నారో తెలియదు
ఏ ఆక్రోశం
ఎటు ఉపయోగిస్తున్నారో
తెలియని వెర్రి బాగులు

అందుకే
మైదానం ఇపుడు అభి మన్యులను
ఆహ్వానిస్తోంది
బాణాలు గదలు అవసరం లేదు
జనం సమిష్టి పిడికిళ్ళు ఇపుడు
ఆయుధాలు

జనం వేరు వేరు కాదు
వేరు చేయ చూసే మోసగాళ్ళ
పని పట్టాలిపుడు
నా భారతం మతం మత్తులో
బందీ అవుతున్నది
విముక్తి కావాలిపుడు
జాగృత గీతం రాయాలిపుడు
విముక్తి నినాదమై సాగాలిపుడు
××
మార్పు విప్లవానికి అర్థం
పెను మార్పులోనే
సమాజ వికాసం
మనిషి మారుతున్నాడంటే
ప్రగతి కాదు
మంచి మమకారాల
స్థానమేమిటో తెలియాలి
సామాజిక విలువల పతనం
ఏ అభివృద్ధికీ ఆదర్శం కాదు
సమస్యలెన్ని ఉన్నా
బుద్ధితో పరిష్కారం
తెలివి వక్రీకరించినపుడు
చెడు దారుల్లో పయనించినపుడు
వివేక అర్థం
విధిలో కాలరాయబడినపుడు
మనిషికి అర్థం ఉండదు.

లోకమంతా నిండుకున్న స్వార్థం
సత్యాన్ని దూరం చేస్తున్నది
వేగపు పయనంలో
నీతికి పాతర వేస్తున్నది

ఇప్పుడు దులపాల్సింది
బూజులే కాదు
మనిషి మెదడు కిటికీ
బూజులు శుభ్రం చేయాల్సి ఉంది
రోడ్లపై చెత్తనే కాదు

మనుషులకు పట్టిన స్వార్థ
చెత్తనూ దూరం చేయాల్సి ఉంది
నిర్లక్ష్యపు సైతాన్
మనిషిలోని అవలక్షణాలను
దూరం చేయాల్సిన
మంత్రదండం కావాలిపుడు
అనర్థ కారకాలను చూపించే
మనసు అంతరంగం
అద్దంగా మారాలిపుడు

నిజాయితీతో బతకలేక
రాజీలను ఇముడ్చుకునే
బలహీనుల మనస్సుల్లో
ఎదిరించే ధైర్యం రావాలిపుడు
జవాబును కోరే
వెలుగుల ఉదయానికి
సూర్యుడిగా
నువ్వే మారాలిపుడు
దుర్మార్గాన్ని ఎదురించేందుకు
సమాజ గర్భంలోంచి
స్వచ్ఛ ఇన్సానుగా నువ్వే

పురుడు పోసుకోవాలిపుడు.
××
రైతు గుండె
ఆగిపోయిన రోజు
భారతం వెక్కి వెక్కి ఏడ్చింది
తన సంపద
దోపిడీ దొంగల పాలయ్యిందని

నేత ఊపిరి ఆగిన రోజు
మన దేశం దు:ఖించి దు:ఖించి
ఆకాశంకై చూసింది
శ్రమ సంపద
ఉరిపెట్టుకుందని

కార్మికునిరెక్కలు
ఆడని దినం
మట్టి నాకు
ప్రాణం పోతుందని
అడవి దారి పట్టింది

శ్రామికుని చేతులు
సంపద అందుకోని రోజు
పైరు ఎండిపోయి
పొలం నిరాశగా
నీళ్ళవైపు చూసింది.

దేశం
ప్రపంచీకరణ వలయంలో
ఊపిరాడక దప్పికతో
సాగరం వైపు చూసింది
ప్రజాస్వామ్యం కొనదశలో
అడవివైపు స్వేచ్ఛను మొలిపిస్తున్నది.
××
సామాన్యుని
లెక్క తెగడం లేదు
లెక్క తేలడం లేదు
కూడికలు, తీసివేతలు
గుణకారం, భాగహారం
ఎన్ని చేసినా
లెక్క రావడం లేదు
అప్పుపెరుగుతూనే ఉంది తప్ప
తగ్గడం లేదు
పన్నులు పెరిగాయి
ధనికుల సంపద పెరిగింది
సామాన్యుని అప్పు పెరిగింది
లెక్క చిక్కడం లేదు
ఎక్కడి చీకటి అక్కడే ఉంది

బతుకు లేదు, బతుకు గడవదు
నీతి మాటలేదు, అంతా మత్తు
మాయమాటల మత్తు
వనరుల విధ్వంసం
గాలి మాటల మతలబులు
మనసులపై మాటల గాయం
మనుషులపై ఉద్రేకాల గాయం
మత్తులను దాటుకుంటూ
బతుకుపోరు

ఆశల పూదోటలో
మొక్కకు నీళ్ళందవు
వాడుతున్న పూలు
విలువల చట్టాల పతనం
రాజ్యాంగ విలువల పతనం
మారుతున్న రంగులు
బజారులో సిద్ధాంత రాగాలు
ఎగిరే జెండాలు, రంగులు మారుతు
వ్యూహాలన్నీ, డబ్బు చుట్టే
దిగజారిన రాజకీయాలకు
జనాలే ప్రయోగశాల
జన ఎజెండాలు పాతాళంలోకి
ఉద్వేగాల భారతం
రక్తాన్ని సలసలా
మండించే భారతం

అల్లకల్లోల సమాజం
అస్తిత్వంపై దాడుల భారం
కల్తీల భారతం, కబ్జాల భారతం
ఆలోచనలపై దాడి
ప్రశ్నగా మారిన మనుగడ

విలువల పతనం
మత్తుల విలయ తాండవం
సమాజ పయనంలో
సామాన్యుడి విలవిల
ఆర్థిక అంతరం
ఆకాశం, భూమిలా

రాజకీయ రాక్షసత్వం కింద
ఎన్నికలొక బోగస్
లక్షల మొండి బకాయిలు
లక్షల సంఖ్యలో నిరుద్యోగులు
అడుగు అడుగూ
లైంగిక హింస
అడుగు అడుగు
మతాల హింస

శ్రమజీవి అప్పుల్లో
లెక్క తేలదు
లాభాల భారతాన

సగటుజీవి బతుకుండదు

లెక్క తేలడం లేదు
జనం కన్నీళ్ళ లెక్క
సామాన్యుని చెమట లెక్క
తేలడం లేదు.

సాగర అందాలలో కవిత్వ పడవ
కదిలి వెళుతూనే ఉంది.
××
స్వార్థ గద్దలు ఆకాశాన్ని
ఆక్రమించేశాక
నక్షత్రాలు కనిపించడం లేదు
ఒక్కొక్కటిగా రాలిపోతున్నాయి

సంపద మనసును
చీకటి చేశాక
మనవత్వ పుష్పాలు
వికసించడం లేదు
ఒక్కొక్కటిగా తెగిపడిపోతున్నాయి

మనిషి స్వార్థం మనిషినే
కాటు వేశాక
మంచితనపు మధురిమలు
భరించలేని చేదుగయ్యాయి
మనిషి రాక్షసత్వానికి
బానిసయ్యాక
మనసు మల్లెలన్నీ

ఒక్కొక్కటిగా వాడిపోతున్నాయి
రాజకీయ రంగం
స్వార్థ మాటల మత్తులో
మునిగిపోయాక
అమాయక జనాల ఆశలన్నీ
ఒక్కొక్కటిగా
కరుగుతున్నాయి

మతాల కుంపట్లను రగిలించే
రాజకీయ స్వార్థ చర్యలు
పెరిగాక
మానవతా కన్నీళ్ళు
ఒక్కొక్కటిగా రాలుతున్నాయి.
××
సామాన్యుడి పిడికిలి
ఆకాశమెత్తిన పిడికిలి
చరిత్ర మలుపు తిప్పుతుంది

చరిత్ర ఎప్పుడూ
సామాన్యుడి పిడికిళ్ళలోనే ఉంటుంది

భవిష్యత్తు గాలిలో ఉంటుందా
ప్రజల పిడికిళ్ళలో ఉంటుందా

అరణ్యం తలెత్తి
సూర్యున్ని చూస్తుంది
పిడికిలై నినాదమై కదులుతుంది
వీరుడెపుడూ పరాజితుడు కాడు
వీర హృదయాలెపుడు
విధి వంచితులు కావు
ఎర్రని సూర్యుడు మండుతాడు
వెలుగులను వెదజల్లుతాడు

కవి-సూర్యుడు వేరు వేరు కాదు
కవి సమాజానికి వెలుగు
ఎరుపంటే జగానికి ఆధారం
తూరుపు ఉదయం ఎరుపే
కవి జ్ఞాన కిరణాల వెలుగు
రవి సూర్య కిరణాల వెలుగు
ఈ జగానికి మేల్కొల్పుబాట
సూర్యుని కిరణాలు ఒక్కొక్కటి
వాలిపోయినా జనం కోసం
అరణ్యం పిడికిలెత్తుతుంది.
××
ఎప్పుడో, అప్పుడు
కష్టజీవి కన్నీటి చుక్కలు
భూమి పై పడినయంటే
భూమి దగ్గరగా తీసుకుని
ఓదార్చి పంపేది

కష్టజీవి కన్నీటి చుక్కలు
నిరంతరం రాలుతున్న శబ్దానికి
భూమి
బరువెక్కుతున్నది
భయపడుతున్నది

కష్టజీవి కన్నీటి జ్వాల
ఎవరిని కాలుస్తుంది
దోపిడీ శక్తులను
కష్టజీవి చుట్టూ
జరిగే మోసాలను.
××
జీవన చదరంగంలో
గాలి కూడా
దు:ఖితు రాలే

అప్పుడప్పుడు
ఏడుపు శబ్దం వినిపిస్తుంది
కోపం కనిపిస్తుంది

గాలి శక్తి మనకు
తెలుసు
అమృతత్వం ఇస్తుంది

చిరంజీవత్వం ఇస్తుంది
కనిపించని గాలి
ప్రపంచాన్ని బతికిస్తుంది
ప్రకృతి నియమ ఆటలో
గాలి కూడా
తలవంచుతుంది
ఉక్కిరి బిక్కిరి అవుతుంది

గాలికి ఆగ్రం వస్తే...
ప్రపంచాన్ని ముంచుతుంది
సాగరాలను తెంచుతుంది

గాలి లేకుండా బతకలేము
గాలికి చావు లేదు, కానీ...
కష్టాలు, కన్నీళ్ళు, ఆగ్రహాలు
ఉంటాయి.
××
జనం ఓడిపోతున్నారు
పాలకులు గెలుస్తున్నారు
ఓటు రహస్యం ఇది

డబ్బు రాజ్యమేలుతున్న రాజ్యంలో
డబ్బే గెలుస్తున్నది
శ్రమ, చెమట ఓడిపోతున్నది
మత్తు కమ్ముకున్న మేఘం

ఓటు చుట్టే అన్నీ
పరిభ్రమిస్తున్నాయి

నిజాయితీ రూటు మార్చింది
సేవ అర్థాన్ని కోల్పోతున్నది
అంతటా రాజకీయం

గెలుపే లక్ష్యం, ఓటే లక్ష్యం
ప్రజాస్వామ్యం, పరిహాసపాలు
నోటు ఓటుతో గుండెకు గాయం

మెదడుతో ఆట, మెదళ్ళతో ఆట
ఎండిన బతుకులతో
పచ్చనోట్ల ఆట,
సమైక్యతతో, విద్వేషం ఆట

విలువల వలువలు నడిబజారులో
పూల తోటలో, ముళ్ళ జాతర
అంతా దోపిడీయే

శ్రమ దోపిడీ, వనరుల దోపిడి
బతుకు దోపిడీ, సర్వం దోపిడి
మాయ మాటల మత్తు
విద్వేష మాటలకు జనాలు చిత్తు
నెరవేరని సామాన్యుని కలలు

నిత్య జన గారడీ, మోసాల అలికిడి
సిద్ధాంతాల, రాద్ధాంతాలు
మత్తులోనే ఊగే జనం

కట్టు కథలకు బానిస జనం
విద్వేషాలకు బానిస జనం

జనానికి ఏది పదిలం
పర్వతాలు ఓడిపోతున్నాయి
హృదయాలు కఠినమవుతున్నాయి
గాలి విష పదార్థమయ్యింది
సోదరుడు శత్రువవ్వుతున్నాడు
నీరు కన్నీరుగా మారింది
నేల మనకు కాకుండా పోతున్నది
జీవనం మనది కాదు
బతుకు అమావాస్య విషాదం
అంతా అయోమయం

అంతా మెదళ్ళతో ఆడే నాటకం
ఏ దారి ఎటుపోతుందో
తెలియని నిరాశ
ఏ దిక్కు సూర్యుదయమో
అర్థం కాని బాధ
అన్నీ దిక్కులూ
మత్తు నిండిన వికటాట్టహాసం

మనసు దారి తప్పుతుందా
పోరు గీతమవుతుందా
ఆకాశం చెల్లా చెదురు
సమిష్టితత్వం కోల్పోయిన
నక్షత్రాల గుంపు

మేఘాలలో మెరుపు లేదు
ఉరుములేదు, పిడుగులు లేవు
అంతా చీకటి

రాజ్యాంగం, రాజ్యకుట్రలకు
బలి అవుతున్న సమయాన
చల్లగాలి మాటాడటం మానేసింది
చినుకుకు వరద రావడంలేదు

నేల కన్నీటిని తుడ్వడం లేదు
ఇప్పుడు
దు:ఖం సాగరమవుతున్నది
సాగరం అరణ్యమయ్యింది
ఇక మిగిలింది
జన హృదయాలు తూరుపు
అవ్వడమే.
××
ఎందుకు మౌనం, ఎ
ందుకు మౌనం
కనులను మూసి, కలమును ఆపి
సాధించేదేమిటి కలికాలం.

మనుషుల విలువ
మంటలో కలిసి
మత మౌఢ్యానికి అడ్డులులేక
విర్రవీగుతూ దౌర్జన్యాలు
కళ్ళముందటే జరుగుతు ఉంటె
ఎందుకు మౌనం,

ఎందుకు మౌనం

చెవులు పెట్టుకొని చేవచంపుకొని
బాధ్యత మరిచీ, భారం తుంచీ
రాక్షక కృత్యపు, సమాజ చేష్టకు
తలలు వంచుకొని,
ఆత్మ చంపుకొని
బతికె దెందుకు చానాళ్ళు

కళ్ళముందటే మారణహోమం
రాక్షస రాజ్యపు తీరని దాహం
నడి బజారులో నారీ నగ్నం
కులద్రోహానికి ప్రేమికుల హతం
నిన్నటి గాయం మాననే లేదు
కొత్త గాయమై పుండుగ దేశం

అరాచకానికి అదుపే లేదు
రకరకాలుగా నాశనవాదం
ఆలోచన వాదికి లౌక్యం శూన్యం
అవకాశవాదికి అందిన పీఠం
చేవ చచ్చినా, జనస్వామ్యానికి
నోటు ఓటుతో గుండెకు గాయం

సిద్ధాంతాల సిగ్గు, సిగ్గులే
మాటలన్నీ బొగ్గురాతలే
స్వేచ్ఛా, స్వాతంత్ర్యం
వట్టిగ పలికె నినాదాలే

కోరితె గుచ్చే నేటి ముళ్ళే
గుండెలో దూరే తూటాలవుతయ్
వీపులు పగిలే లాఠీలౌతై
గొంతులు నులిపే హస్తాలౌతై
జైలు గదిలోని చీకట్లవుతయ్
నిర్బంధాల ఆర్డర్లవుతయ్
అక్రమ కేసుల రాతలు అవుతయ్

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు,
ప్రశ్నలు, అధికారాలు
గర్వమదానికి ఆటవస్తువులు
సామాన్యునికందని ఆశాఫలాలు
కళ్ళముందటే అరాచకాలు
అధికారాలు, సాధనాలు,

కొంపలు కూల్చే దురాగతాలు
పిచ్చి ఎక్కిన మతమౌఢ్యాలు
సమైక్యతకూ ఆటంకాలు
ప్రశ్నను నరికే ఆయుధాలు
దోపిడీలకు, నవ మార్గాలు

రాక్షసరాజ్యం, ద్రోహులభోజ్యం
సగటు మనిషికి బతుకే భారం
మతం పేరుతో, కులంపేరుతో
భారతావనీ సాగు దారిలో
రక్తపు అలుకులు,
మోసపు పలుకులు
నటనల బతుకులు,

రాక్షస మనసులు

అన్యాయం అని చెబితే చాలు
అణిచివేసే, చంపే కుట్రలు
ఏమిటిదీ ప్రశ్నిస్తే చాలు
నిర్బంధించే అధికారాలు.

సగటు మనిషికీ నీడనె లేదు
లౌకికానికీ అర్థం లేదు
ప్రజాస్వామ్యమిది ఎవరికి తోడు
నాయక మదాంధులు చెబితే ఆడు

ఎవరి జీవితం, ఎవరికోసమూ
అడ్డు నిలిస్తే, అదే ఆఖరు
న్యాయదేవతా కళ్ళముందరే
న్యాయం రోజూ అమ్ముడుపోతే
గర్వబలంతో అన్నీ తానై
ఇష్టారాజ్యం సాగుతు ఉంటే
ఎవరికి, ఎవరు, ఎవరికి తోడు

మనిషి బాధలు, మనుగడ ఆశలు
చేవ చంపుకొని, నిలిచే తీరు
ఎన్నాళ్ళని ప్రశ్నించదు మనసు
మనసుకు ప్రశ్న, ప్రశ్నకు మనసు
కొత్తది కాదు, తర్కంకోసం
ప్రాణం కాదు, ప్రాణం తర్కపు
మూలం కాదు

నీ బతుకేమిటో నీకే తెలుసు
పక్కవాడిదే పొరపాటు
పోరాటం ఇది బతుకుకు మూలం
మనిషిని మనిషిగ నిలిపే ధైర్యం

శక్తి చాలదా సమీకరించు
యుక్తి చాలదా చరిత్రనడుగు
ఉదయించేటి సూర్యుడు తోడు
వీరుడి గీతం, ఆపక పాడు
ఉద్యమ చేతన వెలుగుల కిరణం
ఏ వైపో ఆ వైపుగ సాగు

రేపటి కాలం ఎంచెను నిన్ను
సమరాంగమున పిలిచెను నిన్ను
అంధకారమును చీల్చే ఖడ్గం
వెలుగుల కిరణం నీవేలే

మనప్రతి ఆశ, న్యాయపు శ్వాస
కలముకు చేవ, లక్ష్యపు నావ
శక్తికి రూపం, వెలుగేదీపం
నీవే, నీవే, నీవేలే

ఎన్నెన్నో పోరాట చరితలు
ఎన్నెన్నో మన వీరుల కథలు
ఆకాశమైన ఎత్తిన పిడికిలి
మనసు, మనసునా గెలుపు అలికిడి

మార్పు పథమ్మున నడిచిన నడకా
చిమ్మ చీకటిలో వీరుని కేక
వీరుడి కోసం వేకువరాక

బలవంతుడివా, బలహీనుడివా
మాటల మాటున బతుకీడ్చెదవా
వివేకుడివా, విధిలేనోడివా
ఆశలు చచ్చిన పీనుగువా
ఏది నీ శక్తి, ఏది నీ యుక్తి
మనసులో ఉన్న మర్మమేమిటి
కాలం నేర్పిన నీతి ఏమిటి

ఎదురుగ నిలిచే ధైర్యం లేదా
అడుగులు వేసే శక్తే లేదా
నిజాయితి నీలో నిండుగ ఉంటే
నింగి కూడా వంగి ఉండదా
ఏది నీ శక్తి, ఏది నీ యుక్తి
ఏది నీ శక్తి, ఏది నీ యుక్తి.
××
గుండెలో మండే దు:ఖం
పెయ్యంతా పూసుకొని
ఆలోచన నిండా,
ఇపుడు అంతా,
కమ్ముకున్న చీకటే
ఆవరించిన నల్లటి మేఘాలే

పలకరింపుల చినుకు లేదు
మనసును ఓదార్చే
ఊరడింపు లేదు
విలువల వలువలన్నీ
విప్పుకుంటూ...
నాలుకలపై ఆడేవి
పద నృత్యాలే
మాయా జాలమై నన్ను, నిన్ను
అమాంతం
మోసుకుపోతున్నది.

తేలి ఆటే, తేలని ఆటే
మనసు బలహీనతపై మతాల
నమ్మకం వలను విసిరి
అమాంతం అందుకునే
దోబూచులాట.

కన్నులద్దుకున్న మాయ తెర
ఎటూ తేలని తండ్లాట
నమ్మిముంచే గారడీ
తెలియకుండానే,
పరుచుకునే వలయం

ఇపుడు అంతా చూసి మౌనం
ఇపుడు అంతా వింటూ మౌనం
కలలన్నీ చితా భస్మంలో
అమాయక అరుపులకు
నేస్తాలై
మరణ మృదంగాలను
అడుగడుగునా, పలికిస్తున్నపుడు
లక్ష్యాల మాట,
వెలుతురు రాని నిశీధిలో
నల్లని మబ్బు సంతకం

ఇప్పుడంతా...
కమ్మిన మాయాజాలమే...
దు:ఖపు కన్నీటి స్నానం
తెరలు, తెరలుగా బాధ

ఇప్పుడంతా....

మౌనమే,
ఆవరించిన మౌనం
ప్రశ్నించలేని మౌనం.
××
ఆర్తనాదాల నడుమ ఆకాశం
పగిలిన నేలమ్మ దు:ఖ కన్నీరు
కమ్ముకున్న ప్రళయ చీకటి

తలలు లేని దేహాలు
భవితలు మాయమైన
ఆశలన్నీ ఒక్క క్షణంలో
ఆవిరై శవాల దిబ్బలు

హాహాకారాల విలయతాండవం
విధి రాసిన విశాదగీతం
నిర్లక్ష్యపు క్షణాలు
రాసిన ఫలితం
కాలం పరుస్తున్న దు:ఖ దుప్పటి

తప్పును ఒప్పుకోని వ్యవస్థ
నిర్లక్ష్యం ఆవహించిన బాధ్యత
లేని సమన్వయ
ఫలితం కమ్ముకున్న
సాంకేతిక వైఫల్యం

లగ్గరీల ప్రేమ
సామాన్య నడతపై వివక్ష
ప్రాణాలన్నీ ఆహుతి
నిర్లక్ష్యం చాటున నిత్యబలి
అడుగు అడుగున ప్రతిచోట

ఒక్కసారిగా అంతా చీకటి
జీవిత భవితలన్నీ
చెల్లా చెదురు
కాలమా నువు పరిచిన
వలలో
ఎన్నెన్ని దిక్కులేని
ప్రాణాలను మిగిలిచ్చింది
అనాథలైన
గూడు చెదిరిన
ప్రాణాలకు జవాబేది?

మానవత్వమా పరిమళించు
చీకటిని మిగిలిస్తున్న
నిర్లక్ష్యపు
దు:ఖ కన్నీటి జాడల్లో
మానవత్వమా
వెలుగై ప్రసరించు.
××
గాలి
విజృంభించి చల్లారుతుంది
వెలుగు
విస్తరించి అస్తమిస్తుంది
అది జీవితానికి
సుఖం, ప్రాణం

వర్షం కురిసి ఆగిపోతుంది
అది ప్రాణం పోస్తుంది
నేల
తడిసి తడిసి
పంటనిస్తుంది
ఆకలి తీరుతుంది
సాగర కెరటాలలో
ఆనందం
కనులలో అందం
ఆనందం ఇస్తుంది

మొక్కలు
పెరిగి పెరిగి
చెట్లవుతాయి
అరణ్యం సంతోషిస్తుంది
మొక్కలు నాటిన
చేతులకు ప్రణమిల్లుతుంది

అరణ్యం పెరిగి
ప్రకృతిని రక్షిస్తుంది
ప్రకృతి మనిషికి
కలకాలం తోడుంటుంది
జీవజాలంలో ఆనందం

ప్రకృతి జీవుల రక్షణ
మనిషికి విలువైన సంపద

మనిషిలో మంచి పెరిగి
మానవత్వం వికసిస్తుంది
మానవత్వం
సమాజ రక్షణ

నైతికత
మనిషికి మూలం
క్రమశిక్షణ
కుటుంబానికి అందం

మనిషి ఉన్నతికి మూలం
నేర్పు ఓర్పు సహనం నీతి
సహాయం అదే
జీవన సార్థకత.
××
ఆత్మీయత ఆధారమై
అనురాగం ప్రాణప్రదమై
వ్యధలను గాంచిన భవితను
గుండెలపై
ఆలాపనగా భావించి
స్నేహమై, అనురాగమై
పరితపించే హృదయమై
ప్రసరించే కిరణమై
వెలుగొందిన దైవ రూపమై
అనంత శక్తి ప్రదాయనై
వెలుగునందించి ఇంటి దీపమై
మంచిని పెంచే
శాస్త్రమైన అమ్మ
అదిగదిగో... దు:ఖిస్తున్నది
మైల పడ్డ తనయుని
ఎలా, కన్నానా? అని
అదిగదిగో...ఆలోచనవుతున్నది
ప్రేమను పంచిన దీవెనలు
ఎలా మారాయా? అని
తలుచుకున్న ప్రతిసారి
తనయుని బాల్యపు గుర్తులే
కన్నీరు కారుస్తున్న కళ్ళముందు
మసక మసకగా...
ఆప్యాతయ
హారతులిచ్చిన దీవెన
ప్రాణాలను బలిగోరే
ఉన్మాదమై
విరుచుక పడ్డపుడు
తీవ్రవాదమై
స్వైరవిహారమైనపుడు
బలాదూర్ బతుకులై
సామ్రాజ్యవాద పడగనీడలో
పల్లెల్లో బుసగొట్టినపుడు
అకృత్యాలై విరుచుకుపడ్డపుడు

(మిగతా 4వ పేజీలో..)







# యుద్ధ గీతం

(3వ పేజీ తరువాయి..)

ప్రేమను పంచిన అమ్మ
పెంపకాన్ని
ప్రశ్నించుకుంటున్నది?
ఈ గడ్డపై బిడ్డల్ని
కన్న మాతగా పరిశోధిస్తున్నది
తన ఉనికిని (
పశ్నించుకుంటున్నది
శ్వాసైన ఆత్మీయతకు
సవాలుగా మారిన క్షణాలను
విశ్లేషిస్తున్నది
ప్రేమలు కరువైన పదాలను
ఒత్తిడిని మిగిల్చే చదువులను
నైతికతను మింగిన సమాజాన్ని
సంస్కృతి విలువలన్ని
కాలరాయు ఈ జగాన
మృగాల సంచారమయ్యి
ఎటు చూసిన
కార్పోరేట్ దారిలో ప్రతి ఇంట
చీకట్లే మిగులుతూ
నైతికత పతనమయ్యి
నేరమైనవానాడు
సామాన్యమైనేడు
వెక్కిరిస్తుంటే
ఆధిక్యమైన ఈ యుగాన
మనుగడె ప్రశ్నార్థకమై
స్త్రీ ఆక్రందన పెరుగుతుంటె
ఓడిపోయి, విఫలమయ్యి
అనురాగ మూర్తి అమ్మ
ఇక కననంటూ
మృగాలను
ధిఖ్ఖార శంఖం పూరిస్తున్నది.
××
కలల ఆకాశంలో ఎగిరి ఎగిరి
కన్నీటి వరద లో పడిపోయాను
వరద జోరుగానే ఉంది
సముద్రంలో కల్వకుండ
నా కవిత్వం అడ్డుపడుతుంది.
కవిత్వం అజరామరం
కవిత్వం ఆకాశం
కవిత్వానికి బలమేమిటి
జనం
జనం కన్నీళ్లు జనం చెమట
జనం ధిక్కరణ.
నా గుండె నిలువెల్లా ప్రశ్నలు
అన్నీ ప్రశ్నలే
ప్రశ్నలే కవిత్వమైన రోజు
పిడికిలి ఆకాశమయ్యింది
ప్రశ్నఈనాటి ధిక్కరణ
చీకటి భారతంలో
సామాన్యుని బతుకు
అమావాస్య ఆర్తనాదమే.
కాలం చిన్నది కావచ్చు
పెద్దది కావచ్చు
చరిత్రలో స్థానం లేకపోవచ్చు
వీరుడు ఉదయించినా
సూర్యుడు రాకపోవచ్చు
చరిత్ర గమనంలో
శ్రమ ఉంటుంది.
చందమామ
కొండల్లో దాకోవచ్చు
కెరటం సాగరం
గుండెల్లో ఆడుకోవచ్చు
ఆకాశం వీధిలో
గద్దలు తిరగాడవచ్చు
భవిత పయనంలో
శ్రమ ఉంటుంది.
యుద్ధరంగం జయాపజయాలు
తేల్చకుండా ఖాళీ కావచ్చు
కదనరంగం
కన్నీటి పాలు కావచ్చు
శ్రమ ఉంటుంది
రెక్కల కష్టం మిగిలే ఉంటుంది
ఈ నేల ఉంటుంది
చెమట ఉంటుంది
పోరు పిడికిలి ఉంటుంది
నేల పై పెంచుకున్న
నా....
నమ్మకముంటుంది.
××
యుద్ధం ప్రారంభం
పుట్టుకే ఓ యుద్ధం
ప్రయాణం ఓ యుద్ధం
శత్రువు బలంగా ఉన్నాడు
అస్త్రశస్త్రాలు సిద్ధం చేయాలి
యుద్ధ నైపుణ్యం విస్తరింపజేయాలి
పోరాటం నా ఊపిరి
విజయం గురించి చింతలేదు
నేను సూర్యున్ని
వెలుగునిస్తాను
పంచుతాను
నేను చంద్రుణ్ణి
వెన్నెలలా ప్రకాశిస్తాను
నేను నక్షత్రాన్ని మెరుస్తుంటాను
ఉన్మాద గాలి వీస్తున్నది
రక్త చినుకు రాలుతున్నది
ద్వేష మేఘాలు
అలుముకుంటున్న మనసు
దు:ఖ కన్నీరును కురుస్తున్నది
నవ్వులు పువ్వులు
విరబూసిన మనసు
రక్తాశ్రువులొలుకుతున్నది
సాగరం
అల్లకల్లోలంగా ఉన్న కెరటం
ఆనందం అంతా
మల్లెల మయం కాదు
ఎక్కడా చలువ పందిళ్ళు లేవు
చీకటిని ప్రేమిస్తాను నేను
చీకటిలో వెలుగుల ప్రయాణం
నాది
పోరాటాన్ని ప్రేమిస్తాను నేను
శక్తినిస్తుంది విజయాన్నిస్తుంది
జవాబును వెతుకుతాను శోధిస్తాను
ఆలోచన పరంపరలో
సూర్యున్ని ఆవిష్కరిస్తాను నేను
గాలి ఎటు వీచినా
కొట్టుకపోను ఎదురొడ్డుతాను
నా జనం కోసం నా నేలకోసం
అప్పుడే సుగంధం మకరందం
చినుకులా రాలడం
నదిలా ప్రవహించడం

సాగరంలా పొంగడం నాకు తెలుసు
పోరాటం
తల్లి గర్భంలోనే నేర్చిన వాన్ని
నా మనసు అగ్నిపర్వతం
మండుతుంది వెలుగునిస్తుంది
కాలుతుంది
కలను సాకారం చేస్తుంది
నేను సూర్యుణ్ణి కాంతికిరణాన్ని
నేను చంద్రుణ్ణి వెన్నెల ప్రేమను
తలవంచని ధీరత్వం నేను
ఒక్కొక్క అడుగు కఠినం కావచ్చు
అంతటా చీకటి ప్రయాణం
ఉండవచ్చు
నక్షత్రాలు నా మిత్రులు
ఆకాశం నేను
సిద్ధాంతాల సాగరాన్ని నేను
మెరుపు నా ఊపిరి
పోరాటం నా ధైర్యం
అలుపెరుగని ప్రయాణం నా నైజం
ఉదయిస్తాను
మండే సూర్యునిలా
జనం గుండెల్లో వెలుగుల కోసం
జనం మోముల్లో నవ్వుల కోసం
రేపటి జగతికి వెలుగుల కోసం
××
అడవి కనిపించడం లేదని
పులులు వెదికి వెదికి
నగరంలోకి వచ్చాయి
నగరం అడవిలా ఉంది
ఇప్పుడు పులుల మధ్య జనం
సాగరాలు కలుషితమయ్యాయని
మొసళ్ళు
పల్లె దారి పట్టాయి
పల్లెల్లో ఇప్పుడు
మొసళ్ళ రాజ్యం
ఆకాశం
గద్దల పాలయ్యిందని
పావురాలు వలసపోతున్నాయి
ఎక్కడికో,
దారి లేదు, గమ్యంలేదు
చల్ల గాలిలో ధూళి
చెడిపోయిన వాతావరణంలో
మనసు
చచ్చిపోయిన చేపపిల్ల
సూర్యుడు
ఉన్న వాళ్ళ ఇంట్లోనే
ఉదయిస్తున్నాడు
బీదవాడి శాపంలా వెన్నెలా
సాగర కెరటాలలో
కిరణాలు లేవు
చినుకులో ఆనందం లేదు
వనుకులో ధైర్యం లేదు
అన్నీ ఓడిన దృశ్యాలే
కల్సిరాని కాలంలో
కన్నీటికి కొదవలేదు
ఓటు ప్రజలదే
ఎన్నిక ప్రజలదే
వెటాడేదీ ప్రజలనే...
చిమ్మని చీకట్లో
అక్షరం మెరుస్తూ ఉంది
నక్షత్రం, ఆయుధం
ధిక్కరణ గాలి అయి
ప్రశ్నగా...
సాగర అందాలలో కవిత్వ పడవ
కదిలి వెళుతూనే ఉంది.
××
న్యాయపు చంద్రుడు
వెన్నెలను ఆరబోస్తే
చల్లని వెలుగులకై
ప్రకృతిలో అలజడి
కొండకోన వాగువంక
ప్రతి హృదయం
రేయి, ఉదయాల అలజడి
శాంతిని కోరే నిస్సహాయులు
అశాంతిని రేపే దుష్ట సంరక్షులు
న్యాయం ఒక చోట ఖూనీ
అన్యాయం అదే చోట
విజయరాణి
పోటీ పడి వెన్నెలకై పిలుపులు
వెన్నెల అందరిదా?
మనసున్న కొందరిదా
భావాల్లో, మాటల్లో
కదలికలో, కలవరింతలో
గగనాన్ని పిండి
నేలపై పిండిగా మార్చేటంత
చంద్రున్ని కోసి
నుదుట బొట్టుగా
పెట్టుకునేంత అలజడి
నెత్తుటి ప్రవాహంలో
పీల్చుకునే ఊపిరిలో
ఆలోచన వేగంలో
నిదురరాని వీరుని
ఆలోచన పుంజాల్లో అలజడి
వేయి సర్పాల తల మతం
పడగ విప్పిన అరాచక
బుసల నీడల్లో అలజడి
విషవృక్షముల ఫలముకోసి
మధురముగా తినిపించే
చేతికి కత్తికి నడుమ
సామ్రాజ్యవాద అలజడి
పంచుకున్న నీలి గగనానికి
రెక్కల నమ్ముకున్న పక్షి గమనానికి
గెలుపుల పిలుపు నినాదానికి
నినాదపు గెలుపు పోరాటానికి
నడుమన అలజడి
మరణశయ్యపై పడిన
పల్లె కరువు కాటులో
ఓడిన ఆత్మల
పిలుపుల్లో అలజడి
పాడి పాడి అలసినట్టి
అరచి అరచి బెదిరినట్టి
నీతి కంఠంలో
గరళపు అలజడి
ప్రకృతికి, వికృతికీ నడుమ
పెరిగిన దూరాల అలజడి.
××
గాలి ఎటు వీస్తుందో
పూలు రాలుతున్నాయి
చినుకు రాలింది చిన్నగా
నేల దప్పిక తీరలేదు
కాలాన్ని కన్నీటి చుక్క
కరగదీస్తున్నది
సామాన్యుని దారి మొత్తం
కన్నీటి ధార
కడుపు ఆకలి తీర్చని

బతుకు వృధ
కలల ప్రతి అడుగు
ధ్వంసమవుతున్న వేళ
ఆకాశం
విషాదాన్ని నింపుకుంది
చంద్రుడు చీకటిలో
కనుమరుగయ్యాడు
నేలను దు:ఖం
చుట్టుకుంది
బతుకు
అమావాస్య రాత్రయ్యింది
నేలను నమ్ముకున్నాను
నేల దప్పిక తీరలేదు
కన్నీటి ధార
నా నేస్తం
జీవితాన ఎపుడూ
వీడలేదు
కన్నీళ్ళకు కూడా
అర్థముందంటారు
నా జీవితాన
అర్థం కాని కన్నీళ్ళు ఎన్నో
నా కన్నీరే
సూర్యాస్తమయం
నా జీవిత గాథలే
సూర్యోదయం
××
కవిత్వానికి ఆకాశమే
ప్రతీక
స్వేచ్ఛకు గీటురాయి
ఆకాశమే
స్వేచ్ఛలేని
జీవితమెందుకు
కలానికి
స్వేచ్ఛలేని అక్షరమెందుకు
అక్షరాలు ఎగరాలి
స్వేచ్ఛగా
అక్షరానికి గీటూరాయి
ఆకాశమే
అక్షరాలను బంధించకండి
తిరుగుబాటు
జెండాలవుతాయి
బంధించడం సాధ్యమా
బంధించడం ఎవరివశం
మొక్కలై మొలుస్తాయి
ఆయుధాలను మొలిపిస్తాయి
ధిక్కరణలై రెపరెపలాడుతాయి
పోరు గీతాలై
చుట్టు ముట్టుతాయి
ఆకాశాన్ని బంధించిన
ప్రజాస్వామ్యం
స్వేచ్ఛను బంధించే
రాజ్యం
పరుగు తీస్తుందా
అడుగులు వేస్తుందా
స్వేచ్ఛగా పరుగు తీసేది
కలమే
కలం కోరుకునేది స్వేచ్ఛ
కలం ఆకాశాన్ని సృష్టిస్తుంది
కలం
రాజ్యం పోకడల్ని
తుదముట్టిస్తుంది
కలం వరదై ముంచుతుంది
కలం గాలై
విరుచుక పడుతుంది
కలం స్వేచ్ఛను
కోరుకుంటుంది
కలం ధిక్కరణ
గొంతవుతుంది
కలం
స్వేచ్ఛకు ప్రాణమూదుతుంది
యువతను కదిలిస్తుంది
××
మంచి కోసం, మమత కోసం
బాగుకోసం, బాధ విముక్తి కోసం
నీ జ్ఞానం ఆయుధం కావాలి
ఓ యువకుడా
మన పల్లె వృద్ధి కొరకు
మన ఇంటి వెగులు కొరకు
కష్టాలు తీరెందుకు
విజయాలూ చేరేందుకు
నీ ధైర్యం పట్టుదలతో
మెరిసి పోవాలి
జీవితాన్ని ఒక్కసారి
నెవ్వె చూసుకో
ఏ వైపు నీ గమనమో
బేరీజు వేసుకో
మత్తు ముందు చిత్తుగా
ఓడుతున్న దెవరు
ప్రమాదాల అంచునా
నిలబడుతున్న దెవరు
కన్నవారి కన్నీళ్ళకు
కారకులెవరూ
చదువూ ఎటుపోతున్నది
పెద్దల మాటేమయ్యింది
మన ఇంటి సంస్కృతులు
గౌరవ మర్యాదలేవి
నోటి నుంచి మంచిమాట
ఎందుకు రావట్లేదు
బూతులే నోటి నిండ
ఎందుకు నిండింది నేడు
అలక్ష్యం ప్రతి పనిలో
బలాదూరు తిరుగుడేన
వ్యాయామం ఓ యువకుడ
మరిచిపోతావా
తలిదండ్రుల ఆరోగ్యం
తలిదండ్రుల ఆశయాలు
సమాజాన నిలబడేటి
మంచి లక్ష్య గమనాలు
ఏమై పోయాయి
ఎందుకు కరువైపోయాయి
అన్ని మత్తులకు నువ్వు
ప్రయోగానివా
చెడు మార్గాలన్ని నీకు
చేరువైనయా
బాధ్యతనూ మరిచావా
భారంగా తలిచావా
శరీరక శక్తి నీది
బలహీనమవుతుందా
మత్తు లోన మునిగిపోయి
రోగ నిలయమవుతున్నద
తలిదండ్రుల మాట నీకు
భరించలేనిదయ్యిందా
ఏ మోహం చుట్టుకుంది
నేడు నిన్ను
నిజం తెలుసుకో యువతా
క్రమశిక్షణ పెంచుకో
బలాదూర్ బతుకుల్లో

వెలుగేది రాబోదు
కష్టపడనిదేదీ నీ దరికి
చేరబోదు
నిర్లక్ష్యం మానేసీ
భవిత బాట మలుచుకో
ఆశయాలు సాధించగ
పట్టుదలను పెంచుకో
యువత శక్తి దేశశక్తి
చైతన్యం ప్రతి అడుగున
పెంచుకుంటు సాగిపో.
××
ఓ యువకుడా
పోరాటంలో
నిజాయితీ ఉంటే
ఆయుధం అవసరంలేదు
పిడికిళ్ళు చాలు
జనం పోరాటంలో
ఉన్నప్పుడు
ఒక్కొక్కరూ
ఓ ఆయుధమే
పోరాటం
వ్యక్తిగతం కాదు
సామాజిక న్యాయం
పిడికి లెత్తాలి
పోరాటం స్వార్థ పూరితం కాదు
త్యాగం అడుగు అడుగునా
ఆయుధం
పోరాటం వ్యవస్థపైనే
దోపిడీ పోరాట జ్వాలలో
బూడిద కావాలి
పోరాటం
రక్తమయం కాదు
శాంతి కొరకు పోరాటం
కాంతి కొరకు
జనం కొరకు
బాధల విముక్తి కొరకు
పోరాటం.
××
యువతరమా పిడికిలెత్తు
ఈ రాక్షస చేష్టలపై
భారతమా ఎదురు తిరుగు
ఆగని అన్యాయంపై
ఎటు చూసిన రోదనలూ
ఎటు విన్నా వేదనలూ
మనిషి మనసుపై జరిగే
ఆగని విద్వేషాలపై
దేశంలో అడుగడుగున
మారణహోమాలే
ప్రతినిత్యం రెచ్చగొట్టె
ద్వేషకుతంత్రాలే
మనుషులపైనా దాడి
ఓట్ల కోసమూ నిత్యం
విడదీసే రణతంత్రం
దుర్మార్గం అవినీతి
పరిధి దాటిపోయిందిక
మతం మత్తుజల్లిరోజు
మాయ చేస్తున్నారు
దేశాన్ని దోచిబెట్టి
అభివృద్ధి అంటున్నరు
రాజ్యాంగం విలువలన్ని
మంట కలుపుతూ ఉన్నరు
మాయమాటలా చాటున
మూటలు గడుతూ ఉన్నరు
జనం బాధ జనం గోడు
ఎవరూ వినలేనప్పుడు
విద్వేషం పెంచేసీ
విడదీయ చూస్తున్నరు
ఘనమైన దేశ చరిత
కాలరాస్తు ఉన్నరు
మాటలాడె మాటలకూ
అడ్డు అదుపు ఏదిలేదు
రెచ్చ గొడుతు జనాలను
ఓట్లు దండుకుంటున్నరు
చిచ్చులు ఎన్నో పెట్టి
మనిషిని హతమార్చినపుడు
అసత్యాన్ని సత్యంగా

మార్చేటి కుతంత్రాలు
అలజడులను సృష్టించే
ఆగని విద్వేషాలు
ఆక్రందన రోజు రోజు
బీదరికం పెరుగుతుంటె
మత్తులోన యువత భవిత
ముక్కలవ్వుతూ ఉంటే
న్యాయమందె మార్గాలు
ప్రజలకు కనిపించనపుడు
సమాజమా పిడికిలెత్తు
ప్రజాస్వామ్యమా పిడికిలెత్తు
ప్రజాస్వామ్యమా ఏమిటీ ఘోరం
మానవతా ఎక్కడమ్మా, నువ్వు
క్షమించకమ్మా
ఈ తలదించుకున్న సమాజాన్ని
మౌనాన్ని శరీరం నిండా
నింపుకున్న
మూగ జనస్వామ్యవాదాన్ని
అన్నింటికీ చెరగని
మసిపూసిన
మానవతను క్షమించకమ్మా...
అభాగ్యుల ఆర్తనాదాలు
నర రూప పిశాచాల
మదమెక్కిన
వికృత విన్యాసాలు
గాయాల ప్రజాస్వామ్యం
ఆగని ఆక్రందనల రాజ్యం
ఇంకెందుకు మానవతా పాఠాలు
ఇంకెందుకు స్వేచ్ఛాగీతాలు
స్వేచ్ఛా భారతి కొన ఊపిరి
ఎవరి మౌనాన్ని భరించడానికి
సమాజమా నువ్వు ఏ మత్తులో
అడుగడుగున రాక్షస కృత్యాల
తాండవ కరాళ నృత్యం
ప్రశ్న
ఎందుకీ మౌనం
ఎవరికి ప్రశ్నగా ఘోరాలు
అనాగరికం వెర్రితలలు
రక్తం పారే దారులు
బీద గుడిసెల్లో
దౌర్జన్య మంటలు
కాలే గాయాలు
విరుచుకు పడే ఉన్మాదులు
మతం మత్తులో యువత
ఆర్తనాదాల భారతం
ఉద్వేగాల, ఉద్రేకాల
యువ భారతం
కాలమా, ప్రశ్నించు
ఎవరికి ప్రశ్నగా నేటి భారతం
నిస్సహాయుల రక్షణేది
దౌర్జన్యాలకు జవాబు ఏది
ఎవరికి ప్రశ్నగా నేటి భారతం
తలలు వంచినా సమాజానికి
మౌనం దాల్చిన సమాజానికి ప్రశ్న
హోరున లేవని ఉద్యమానికి
ఏకం కానీ,
జనపిడికిళ్ళకి ప్రశ్న
కొన ఊపిరి లోని
మానవతకు ప్రశ్న
కవి కలం రాసే
అక్షరానికి ప్రశ్న
కాలం గుప్పిట్లో పెట్టుకోవడం
కవిత్వలక్షణం
ఇప్పుడు గుప్పిట బలహీనంగా ఉండి
రైతు కన్నీళ్ళకు
కవి గుప్పిట చాలడం లేదు
రైతు జీవితంలో
సంతోషాల వెన్నెల లేదు
చీకటి ఆమావాస్య
కన్నీళ్ళ లెక్కలేదు
బాధల లెక్కలేదు
అడుగడుగున జరిగే
మోసాలకు లెక్కలేదు
రైతు కన్నీటికి రోడ్డు సాక్షి
ఎగరేసిన ఉద్యమ బావుటా
రెపరెపల సాక్షి
ఎండకు ఎండిన రోడ్డు నేడు
కన్నీటితో తడుస్తున్నది



## ఇప్పటి వరకు వెలువడిన రచనలు

1. తబ్లాల్ (తెలంగాణ ఉద్యమ కవిత్వం)-2008
2. చైతన్య వసంతం (తెలంగాణ ఉద్యమ కవిత్వం)- 2010
3. గుండెలవిసిన చోట (తెలంగాణ ఉద్యమ కవిత్వం)-2014
4. ధైర్య కవచం- 1 జూన్, 2023

### పాటల పుస్తకాలు

1. స్నేహం ఒక ప్రశ్నగా- మార్చి 2016
2. జలం, జీవం, జీవనం - జూన్, 2016
3. భారతీ వందనం- ఆగష్టు, 2016
4. పోరు వీరుల యాదిలో- జూన్, 2017

### పాటల సీ.డీ.లు.

1. అలజడి-తెలంగాణ ఉద్యమ పోరు హెూరు- 2011
2. పాటకు సలామ్- సామాజిక గీతాలు- 2015
3. గెలుపు గీతం- విద్యార్థుల పాటలు-2018
4. హెూరు పాట సాక్షిగా- సామాజిక గీతాలు- 2019
5. స్వాగత గీతం- విద్యార్థుల పాటలు-2019
6. వలస కార్మికుల గోస- సామాజిక గీతాలు-2020
7. చదువుదాం పుస్తకము-విద్యార్థుల పాటలు-2021.

### సంపాదకత్వంలో వచ్చిన పుస్తకాలు

1. లిటిల్స్-విద్యార్థుల కోసం-2012
2. గురుదేవోభవ-విద్యార్థుల కోసం-2013
3. ఎన్నీల ముచ్చట్లు-1,2,3 (తె.ర.వే)-2018
4. ఎన్నీల ముచ్చట్లు-4,5,6,7,8,9 (తె.ర.వే)-2019
5. సృజన సంగమం (తె.ర.వే)-2019
6. సైరన్ (తె.ర.వే) ఆర్టిసి కార్మికుల సమ్మెకు కలాల మద్దతు- 2019
7. కరోనాపై కవితాస్త్రం (తె.ర.వే)-2020



బతుకు భరోసాకై ఆపాదం
సాగుతున్నది
దిగ్బంధనాలను దాటుకుంటూ
హక్కులకై సాగుతున్నది
హామీల అమలేదని
శాంతిగానే అడుగుతున్నా
కాల్పుల బెదిరింపులను
ప్రశ్నిస్తూ సాగుతోంది
రైతు కార్చేటి రుధిరానికి
కవి కలం కన్నీరై పోతున్నది
ప్రశ్నగా కలం
కాలాన్ని అడుగుతున్నది
రైతు పాలిట ఎపుడూ
అమావాస్య చీకట్లే ఎందుకని
భూమి పుత్రుని ఇంట
కష్టాలే ఎందుకని.
××
ఈ భూమి చెబుతోంది
తన గుండె మండుతోందని
గుండె మండుతుందనీ
తనను కాపాడుకొమ్మనీ
జన్మనిచ్చిన తల్లి
నిలబెట్టిన ఈ భూమి
ప్రకృతికే అందమయ్యి
సృష్టికి మూలం భూమి
కాలుష్యం కాటులోన
ప్రాణికోటి చేటులోన
పతనమవుతు తన
భవితను మార్చలేకున్నదీ
అభివృద్ధీ పేరునా
మనిషి మారిపోయినా
అస్థిత్వ ్యం మరిచెనా
కనికరమే వీడెనా
భూశాపం, భూతాపం
రోజు పెరిగిపోయెనా
గుండెల్లో గునపాలతో
అడుగడుగున గాయాలతో
నీడనిచ్చె అడవి తల్లి
విలవిలమని ఏడ్చెనా
అంతరించె దశలోనా
చేరుకునే పక్షులూ
నీరు లేక పోవుచుండె
మూగజీవి శ్వాసలూ
మండుతుంటె ఎండలు
నీడలేని జాడలు
జాడలేని వానలు
ఎండుతున్న పంటలు
మేనంతా బడబాగ్నితో
అగ్ని గోళరూపాలతో
సహన భూమి ప్రకోపంలో
మనల్ని మాడ్చివేసెనా
అజ్ఞానం వీడి మనం
జ్ఞాన వెలుగు పంచాలి
ప్రకృతి తో జీవించే
పద్ధతులను నేర్వాలి
ప్రకృతి మాతకు
మన జ్ఞానం
రక్షణగా ఉండాలి
కన్నతల్లి ఋణం తీర్చ
ప్రతిజ్ఞ చేసి సాగాలి
భూమిని రక్షించుదాము
ప్రకృతితో బతుకుదాము
దు:ఖమైన సవాలైనా
ధైర్యంగా స్వీకరిద్దాము.
××
పచ్చని ఆత్మీయత
పంచుకున్న పుడమికి
ఆనందమయ్యే మేఘాలు
పరువునంతా చినుకులుగా చేసి
వర్షరాగాలతో అభిషేకిస్తాయి
మొలకెత్తిన విత్తు
చెట్టు అయి నీడనిచ్చి
కృతజ్ఞతగా ఎపుడూ
నమస్కరిస్తూనే ఉంటుంది
వెర్రితలల విజ్ఞానం
విర్రవీగిన రాక్షసత్వం
అనువు అనువుగా జీర్ణించిన
కర్కశత్వం
పచ్చని వనాల్లో పెట్టిన చిచ్చు
అగ్ని జ్వాలలను
బహుమతిగా ఇస్తాయి
వనకోయిల పిలుపుతో
పులకించే మేఘ ప్రియురాలు
ఇప్పుడు పిలుపుకై
కోటి కనులను చేసుకుంటున్నది
అమృతధారలు కురిపించే
మేఘ నిరీక్షణలో భూమి
కాలపు కను బొమ్మలనుంచి
వీక్షిస్తున్నది
ముక్కలు ముక్కలుగా
పగిలిన దేహంలో
తన జాడలను చూసుకుంటున్నది
ఏదీ? ఎవరి నిరీక్షణ
ఫలించదేమీ?
రవి కిరణ బాణాలు
ఎదను గుచ్చుకుంటుంటే
నీటి చెమ్మకై
గునపాలు దిగుతుంటే
భూ తల్లి ఆక్రందన
గుండెల్లో పెరుగుతున్నతాపం
ప్రకృతి కోపంలోపెట్టిన శాపం
ఎన్ని సునామీలకు
అడ్డుకట్ట వేయాలి
ఎన్ని హిమోన్నత శిఖరాలను
రాలకుండ ఆపాలి
విజ్ఞానమేడలో
బంధీ అయిన మానవత్వమా
మరిచిపోయి మిగల్చకు
భవితకు పుట్టెడు దు:ఖాన్ని
అడుగడుగునా అంతపు
అంధకారాన్ని.
××
నేలను
చేరిన చినుకును
ఆత్మీయ పొరల్లో బంధించి
తీయని మట్టి వాసనతో
ఉప్పొంగిన భూమి
గుండె గర్భాన్ని చీల్చుకొని
పైకెదిగిన పంట పైరు
గాలికి నృత్యమాడుతుంటే
తాను గీతమై పోవాలని
కోరుకుంటున్నది
అన్నదాత స్పర్శ తగిలి పైరు
పులకించిపోయినపుడు
పులకింతలన్నింటిని
మట్టి మది తులుపులు తెరచి
జ్ఞాపకంగా

దాచుకోవాలనుకుంటున్నది
కోతకొచ్చిన నాడు
కొడవలి పైరును ముద్దాడితే
మనసుతో బిడ్డను ఆశీర్వదించి
తన ఇంట సిరులు నింపే
దీవెనలవ్వాలనుకుంటున్నది
బిడ్డపై చిరకాల ప్రేమను
ఒలకబోసుకుంటున్నది
నేలను నమ్ముకున్న హృదయం
దళారీ ఐక్య రాగాల నడుమ
దగాపడుతూ, అన్నదాత
ఆత్మవిలువ
నడిబజారున
శోకగీతమై వినిపిస్తుంటే
వినలేని అసమర్థుల మధ్య
తల్లడిల్లిన నేల తల్లి
కలలుగన్న స్వప్నాలను
విప్లవ శంఖాలుగా
మార్చి మార్చి పూరిస్తున్నది
అరణ్యం మరో పోరాటానికి
ఊపిరి పోస్తూ...
అరణ్యం తలెత్తి
సూర్యున్ని చూస్తుంది
బలంగా ఉంది
బంధీగా ఉంది
బంధీగా ఉన్నా
తూర్పుకు బాసటగా ఉంది
ఆకాశాన్ని, అరణ్యాన్ని
వీక్షిస్తున్నది తూరుపు
సూర్యకిరణాలు ఒక్కొక్కటి
వాలిపోతున్నా
తూరుపు ఉదయిస్తుంది
ప్రకాశిస్తుంది
నక్షత్రాలు రాలిపోతున్నా
తళతళా మెరిసే
తూరుపు ఉదయిస్తుంది
చీకటిని సవాలు చేస్తుంది.
ఇదేం దు:ఖం
ఇదేం ఆకలి
రైతు ఆకలి
వెక్కిరిస్తున్నప్పుడు
ఇదేం లోకం
ఇదేం కాలం
లోకం ఆగేది కాదు
శోకం ఆగిందీ లేదు
కవికి నిద్రలేదు
కలం ఆగిపోయినట్టు కల
రాజ్యం దోపిడీ ఆగదు
కాలం కదలక మానదు
రాజ్యంకు కన్నీరు రాదు
కష్టజీవి కన్నీటి బాధతీరదు
కవిత్వం ఋణగ్రస్థం
ఎంతకాలం దు:ఖం
ఎంతకాలం మోసం
పండించిన పంట
కార్చిన చెమట
నా కడుపు నింపనపుడు
ఇదేమి రాజ్యం
పొలం అదే నేల అదే
యంత్రాల గారడీలో
పంట పెరిగింది
రైతు ఆదాయం తగ్గింది
అదెలా సాధ్యం
మోసాల లెక్కవిప్పండి
దోపిడీ సామ్రాజ్య
లెక్క తీయండి
నిశ్శబ్ధం ప్రాణం తీస్తుంది
శబ్ధం ప్రాణం పోస్తుంది
ఎందుకు పాపాలను
గుండెలో దాచుకుంటావు
ప్రశ్న ప్రపంచానికి అమృతం
ప్రశ్నించు, ప్రశ్నించు
ప్రజాస్వామ్య పూల జల్లుకల
ప్రశ్న మరిచి ఆకాశం
స్వేచ్ఛ కోల్పోయింది
ప్రశ్నించలేక నేల
తడి, ఆరిపోయింది
ప్రశ్నించలేక చినుకు
భయం కురుస్తున్నది
ప్రశ్నించలేక గాలి
స్వచ్ఛత కోల్పోయి
కల్తీ మయమయ్యింది
ప్రశ్నించలేక
మన భారతం
దోపిడీ రాజ్యమయ్యింది
ప్రశ్నించు, ప్రశ్నించు
మతం
రాజకీయమెందుకయ్యిందో
ప్రశ్నించు
దోపిడీని ప్రశ్నించు
అధర్మాన్ని, అవినీతిని
దొంగల రాజ్యాన్ని ప్రశ్నించు
నీ కలం ఆయుధమైతే
ప్రశ్నించు
ఓటమి అనివార్యమైనాక
చీకటి బాధెందుకు
ప్రశ్నించు
చీకట్లో దీపం వెలిగించడం
చేత గాని వాడు
భయం గుండెలమీద
నిలబడతాడు
భయమెందుకు
ప్రశ్నించు
ఈ జీవితం నీదా?
జనాలదా?
గాలినడుగు చెబుతుంది
నీ మనసు
ఏ దరి దాపుల్లో ఉందో
ఉద్యమ గీతాన్నడుగు
చెబుతుంది
నీ ప్రయాణం ఏ దుక్కుకు
జన పిడికిళ్ళనడుగు
ఎవరిని ప్రశ్నిస్తావో లేదో
నీ ఇష్టం
నిన్ను ఈ సమాజం
ప్రశ్నించక మానదు
ఇది తెలుసుకో
ప్రశ్నించు, ప్రశ్నించు.
××
చీకట్లో వెలుగు కాగడాలు
నిత్యం ఉప్పొంగే సాగరాలు
ఎగిసిపడే ఆలోచనల అలలు
మనసునిండా వేదనలు
కలల ప్రపంచ ఆలాపనలు

దివిటీ లై వెలిగే
మానవత్వ మార్గాలు
మేల్కొల్పు బాటలో
నిత్యం పరితపించే
హృదయాలు
మనసులోని భావ సంఘర్షణలు
అగ్ని జ్వాలల్లో మెరిసే కలాలు
మంటలు పుట్టించే అక్షరాలు
వెంటాడే సాహిత్యంతో కలాలు
నడిపించే కవిత్వంతో కలాలు
రాజీపడని కలాలు
రాజీలేని పోరాట ఊపిరులు
కాలంతో పోటీ పడే కవిత్వం
ఆకాశంతో
నిత్య పోరాటం కవిత్వం
జన అక్షర ఉషస్సు
మదనపడే అలజడుల మనస్సు
గాయపడిన అక్షరాలు
చేసేటి నిత్య తపస్సు
ఎగిరే సాహిత్య జెండాలు
సామాన్యుని కలల సాకారాలు
మట్టిని వీడని నిబద్ధతలు
కలాల పట్టుదల
కలాల సాధన
కలాల సంఘర్షణ
నిద్దుర పట్టని కలాల
ఆలోచనల రాత్రుల నేస్తాలు
ఆలోచనై సాగే
కలల కాపలాదారు కవిత్వం
అక్షర సైనికులు కవులు.
××
ఎక్కడైనా, ఎప్పుడైనా
కర్కశపాదం
కదం తొక్కుతూనే ఉంటది
తిరగబడ్డ బిడ్డల
వెచ్చని రక్తం ఎపుడూ
చిమ్ముతూనే, ఉంటది
జనస్వామ్యరాజ్యంలో
జన హక్కుల కాలరాత
నిలదీసే గుండెలపై
తూపాకీ, తూటాల మోత
ప్రజల రక్షణ, మానవ హక్కులు
గుండె నెత్తురులు, నిత్య హననాలు
రక్తం రుచి నెరిగిన నాలుకలు
పాములయ్యి కాటేసే మూతులు
ద్రోహులుగా దోచేసేందుకు
ప్రాణాలను తోడేసేందుకు
వీపు మోతల లాఠీలు
రక్షణ మరిచిన బాధ్యతల
రక్త దాహం తీరలేదు
భావాల ఆలింగనంలో
దృతరాష్ట్ర కౌగిలి వీడలేదు
కలికాలపు రాజ్యంలో
హక్కుల హననం ఆగలేదు
వీరులగన్న తల్లికి ఎపుడూ
పుత్ర శోకం ఆగలేదు
ఎన్ని ముసుగులు
మతాల పేరిట
ఎన్ని చర్యలు
కులాల పేరిట
ఆలోచనపై, ఎన్ని రంగులు
భవితవ్యంపై చుట్టుకుంటయి
ఎన్ని నాళ్ళు హక్కులపై కక్ష్య
ఎన్ని నాళ్ళు ప్రశ్నలపై
ఉక్కుపాదం
ఎన్ని నాళ్ళు రక్షణ లేని గమనం
నాలుకలు అమ్మేసిన నోళ్ళు
హక్కుల భగ్నం
అడగలేని దీన స్థితి
ఎన్ని విధాలుగా శాసనం
ఎన్ని విధాలుగా ఆలోచన కబ్జా
ఎత్తని పిడికిళ్ళు,
రోధనలకు ఆనవాళ్ళు
ఎత్తిన పిడికిళ్ళే,
ధైర్యమార్పుకు ఎగురు జెండాలు
సాగర అందాలలో
కవిత్వం పడవ
కదిలి వెళుతూనే ఉంది
అందాలను ఆనందం
అక్షరాలుగా మలుస్తూ
వెన్నెల రాత్రులలో
ప్రేమ గీతాలు పాడుతూ
కెరటాల ధ్వనుల
సంగీత రాగాలు చేస్తూ
ఒడ్డు ఇసుక రేణువులను చేస్తూ
సూర్య కిరణాల కాంతులను
కన్నుల్లో నింపుకుంటు
కవితా శిల్పానికి కొదవలేదు
భాష అనుభూతి
గీతాన్ని ఆలపిస్తుంది
అయినా, నిరాశే...
వస్తువు దారి తప్పిందని
పడవ ఏ దిక్కు వెళుతుందో
తెలియదని
దిక్కులు కనిపించడం లేదు
సాహసం ఊపిరి కావడం లేదు
అడుగు అడుగు
రాక్షసత్వ ముళ్ళు రాళ్ళు
ఆకలి కడుపుకు
శస్త్ర చికిత్స నేటి రాజకీయం
ఏది కవిత్వ వస్తువు కాదు
కవిత్వ పడవ
వెన్నెల అందాలలో
సాగిపోతూ ఉంది
జీవితం ఓడిపోయిన దు:ఖం
పోరాట హస్తాలు అలసిపోయాయి
ప్రపంచీకరణ వల బలంగా
చుట్టు ముట్టింది
జీవితం
మల్లెపూల సుగంధమా
కాదు
శ్రమ చేతులు
పిడికిలి కాకుండా
రాజకీయ కుట్ర
కవిత్వ పడవ
వెన్నెల్లో సాగిపోతూనే ఉంది
జనం కన్నీళ్ళు తుడ్వడానికి
అరణ్యం విచ్చుకుంటున్నది
కలం ఆయుధమై
పదునెక్కుతున్నది
ఆకాశం మిల మిల
మెరుస్తున్నది
చుక్కలు జయ గీతాలు
పాడుతున్నాయి
మెరిసే తూరుపా
యుద్ధ గీతమందుకో...





"అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఫేస్బుక్ గ్రూప్ లో నిర్వహిస్తున్న "వారం వారం మినీ కవితల పోటీ"లలో ఎంపికైన 'స్నేహం'పై మినీ కవితలు...

-డా. రావి రంగారావు 9247581825

కుచేల కృష్ణ
గుప్పెడు అటుకులు!
ఫేస్బుక్ ఇన్నాళ్ల "స్నేహం" కు
గూగుల్ పే అకౌంట్!!
ఆ "గుప్పెడు" స్నేహం పదిలం
ఈ "గూగుల్ " స్నేహం తాయిలం!!!

-సదాశివన్

గ్రూపులు ఎన్నున్నా
రక్తం రంగు
ఎరుపు..
మతాలు వేరైనా
స్నేహ పరిమళం
గుబాళింపు!

కోటిదివ్వెల కాంతులతో
వేలతారల వెలుగులా,
శ్వేతప్రభల
వెండి వెన్నెలలా...
వన్నె తగ్గనిది
స్నేహ బంధం!

-కాయల నాగేంద్ర

శ్రీకృష్ణ అర్జునుల మధ్య
సఫల స్నేహం,
దుర్యోధన కర్ణుల మధ్య
విఫల స్నేహం...
అన్ని స్నేహాలూ ఒక్కటి కావు!

-నంద్యాల లక్ష్మారెడ్డి

ఆదుకొని ఆదరించేది
అండగా నిలిచేది
అసలైన స్నేహం,
కాటేసి కనువిప్పు కలిగించేది
కపటస్నేహం.

-లత మోర

తరగతి గదిలో పుట్టి
తరగతు లెన్నో మారి
ప్రాణానికి ప్రాణం,
నమ్మకం అనే నాణానికి
బొమ్మాబొరుసులా
కలకాలం కలిసుండే స్నేహం...

- పి. రామకృష్ణ

మనసును చదివేది,
మనిషిగా బ్రతికేది,
ఆపద తెగులు రానివ్వనిది,
కుల, మతాల చీడ పట్టనివ్వనిది,
రక్తం ఒకటే అని నమ్మేది,
కల్మషం లేని నవ్వు చిందించేది...

-మల్లారెడ్డి రామకృష్ణ

**మేకవన్నె స్నేహం**

నీ స్నేహ హస్తం
అందుకుంటూనే
అగాధంలోకి లాగే
మేకవన్నె
పులు లుంటాయి-
జాగ్రత్త!

-ప్రవిష్ కొండిపర్తి

**రుచి చూసా**

లంచ్ బాక్స్ మర్చిపోయాను,
నలుగురు నాలుగు ముద్దలు పెట్టారు,
కొత్త వంటలు తిన్నాను,
అంతకు మించి
స్నేహాన్ని రుచి చూశాను..!!

-లీలాకృష్ణ

నిన్నటినీడలో నిలబడి
నేటి ఎండను సహించే
వెర్రిబాగుల సనాతనుడు
స్నేహితుడు!

-వల్లూరి రామారావు

స్నేహమంటే?
మనసు చూసేది,
దాపరికాలు లేనిది,
కన్నీటిని ఒడిసిపట్టి
చీకటిలో వెలుగై
చిరకాలం జత కట్టేది...

-ఛాయా స్వప్న

స్నేహం
దాహం తీర్చేది
సందేహం పరిమార్చేది
మానవ హారాన్ని కూర్చేది
సాటి మనిషి ఉన్నతిని ఓర్చేది

-శ్రీరామదాసు అమరనాథ్

చిటికెలో మాయమయ్యే
మెరుపు కాదు,
నిలకడగా వెలిగే దీపం...
స్నేహం
ఒక మినీ కవిత !

-చిత్తలూరి

కులం కుళ్లు చూడదు..
మతం మత్తు అంటదు..
ధనం వ్యాధి సోకదు..
స్నేహం..అదో దేవతాపుష్పం!
అందుకున్నవారు ధన్యం!

-వసుధ

సూర్యుడు సాగరుల
స్నేహఫలాలు
వర్షధారలై
భూమి కడుపు పండింది!
ప్రజల కడుపు నిండింది!

-ఎస్.రవికుమార్

జీవితం కడలిలో
సుడిగుండాలు దాటాలంటే
స్నేహం పడవ ఎక్కి
నమ్మకం తెడ్డుతో సాగాలి.

-ఆళ్ళ నాగేశ్వరరావు

సృష్టిలో
కల్తీ కానివి రెండే రెండు.
అటు భగవంతుడు
ఇటు నువ్వు... అంటూ
స్నేహం భుజాన్ని తడుతూ దీపం...

-శివకుమార్ ఎనికేపల్లి

ఆనందంలో ఆర్భాటం,
ఆపదలో ఆసరా,
కష్టాల్లో భరోసా,
దుఃఖంలో ఓదార్పు...

-టి. ఎ. ప్రభాకర్

ఇన్బాక్స్ పరిచయాలు కాదు
లంచ్ బాక్స్ పంచుకోవడాలు కాదు,
బ్యాచిలర్ పార్టీస్ కాదు...
స్నేహమంటే
బ్రతికే దెలాగో
ప్రాక్టీస్ చేయించడం...

-సుధా కోసూరి

కష్టానికి
గెలుపుతో స్నేహం,
జీవితానికి
సంతోషంతో స్నేహం,
పేదోడికి
సద్దికూటితో స్నేహం!

-లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం,

**స్నేహం**

చీకటిలో
కొట్టుకుపోతున్నప్పుడు
వెలుతురు పడవ...
ఎండలో
కాలిపోతున్నప్పుడు
వెన్నెల గొడుగు...
స్నేహం
ఒక రక్షా కవచం.

-డా. రావి రంగారావు,
గుంటూరు.

అలా ఉండాలి
ఆశించని మనసుండాలి
అరమరికలు లేకుండాలి..
అతడే నువ్వని పించాలి
తనలో నువు కనిపించాలి..

-మేడిశెట్టి యోగేశ్వరరావు

ఒక్క పదం లో
రాయగల
జీవితమంత
అనుభూతి కావ్యం

-రహీమొద్దీన్

చీకటిలో జాడ,
వెలుగులో నీడ...
అహం అంటని స్నేహం,
కనుపాపకు
అందిన కావ్యం...

-శింగరాజు శ్రీనివాసరావు

## పురుషార్థము

భాగ్యమును నే కోరను
బాధ్యతలను వదలను
బాధలకు నే కృంగను
భవితకై నిరీక్షించను.

ఆశలకు నే తలవంచను
ఆశయాలు విడనాడను
మోసాలు నేనెరుగను
కపట వేషాలు నే వేయను.

శ్రమను గౌరవిస్తాను
లేమిని ప్రేమిస్తాను
కలిమిని. గమనిస్తాను
మేలిమిని పూజిస్తాను.

ఆత్మస్తుతి నే చేయను
ఆత్మశృతి లో మసలుతాను
అంతరాత్మను నమ్ముతాను
ఆత్మీయులను తలుస్తాను.

జీవిత మొక రణరంగం
సమస్యలే రుజుమార్గం
ఎదురీతలు నిరంతరము
బరిలో నెగ్గడమే పురుషార్థము



-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

## గజళ్ళు



ఒక్క వేటుకే చెట్టులా 'కూలితే' ఎలా?
చిన్న కుదుపుకే నావలా 'ఒణికితే' ఎలా?

పుటకంటే సంబరం! నింగినంటు హాసం!
చిగురు గాలికే ఆకులా 'అల్లాడితే' ఎలా?

దారంటా వెళుతుంటే, ముళ్ళుంటాయ్ రాళ్ళుంటాయ్
ఇసుక మేటకే పయనమలా 'ఆపితే' ఎలా?

నిరంతరం కలగంటేనే, నిరంతరం రాస్తావు!
కలలనాపి సృజననలా 'నిలిపితే' ఎలా?

కవికాన్న మనిషే గొప్ప! మనిషితనం ఏదప్పా?
నీలో నువు శంకర్ నిరంతం, 'పొగిలితే' ఎలా?



-సూరారం శంకర్
సెల్:9948963141

పుస్తక సమీక్ష

# లోతైన భావాలతో.. పూర్ణచందుగారి "ముక్కాలు"!

ఓ వ్యాసకర్తగా, కాలమిస్టుగా, పరిశోధకునిగా శతాధిక గ్రంథకర్తగా దాదాపు అందరికీ పరిచయమున్న రచయిత, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ జి.వి. పూర్ణచందు గత ఐదు దశాబ్దాలుగా భాషా, సాహిత్య, పత్రికా రంగాల్లోనే కాక, సామాజిక రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతుడు. అమలిన శృంగారం వంటి శాస్త్ర గ్రంథాన్ని, తెలుగుధీర, సప్తసింధు నవలలను వెలువరించిన అనుభవం ఆయనకు ఉంది. **కాంతి స్వప్న దీర్ఘ కవిత, వెలుగు రాగాలు** కవితా సంపుటివి కూడా ప్రకటించారు. కానీ ఆయన కాలమిస్టుగా, వ్యాసకర్తగా, ఓ రచయితగా మాత్రమే చాలా కాలం అందరి హృదయాల్లో కొలువుదీరారు. కవిత్వం కోసం కూర్చుని, ప్రయత్నించే అలవాటు తనకు తక్కువ అనీ ఆయనే వినమ్రంగా ప్రకటించుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఆయన ధ్యాసంతా పరిశోధన, విశ్లేషణ, వివరణ, వ్యాసాలపైనే ఉండటం గమనార్హం! ఇలాంటివి కవిత్వ సృజనలోనూ ఉంటాయనీ.. వ్యక్తీకరణలో మాత్రమే వ్యాసానికీ, కవిత్వానికీ మౌలికమైన వ్యత్యాసముంటుందని మిత్రులతో, సాహిత్య సృజనకారులతో ఆలస్యంగా తెలుసుకుని- కవిత్వంపై కూడా దృష్టి పెట్టి **'ముక్కాలు'** పేరుతో మూడు పాదాల్లో మినీ కవితలను రాసి.. మనీ భావా లను ప్రకటించడానికి పూనుకుని పూర్ణచందుగారు, అనేక చిన్ని కవితలకు జీవం పోశారు. సహజంగా పూర్ణచందుగారు రాసే రచనల్లో, ముఖ్యంగా వ్యాసాల్లోని అంశాలు చక్కని పదబంధాలతో, చిక్కని భాషా పటిమతో కొలువుదీరుతాయి. ఆయన కొంచం మెలకువలతో, ఆసక్తికరమైన అభివ్యక్తితో, శిల్పం విషయంలో చతురతను ప్రదర్శి స్తూ.. ఓ కవితా ప్రక్రియగా డా॥డి. విజయ భాస్కర్గారి సలహాతో "ముక్కాలు"గా నామకరణం చేసి వందలాది కవితలకు రూపమిచ్చారు. మిత్రులు, ప్రముఖుల సూచనతో వివిధ భాష ల్లోనూ వెలువరించి అందరి దృష్టినా కర్షించిన పూర్ణచందుగారు 'ముక్కాలు' మొదటి భాగాన్ని 2017లోనే పుస్తక రూపంలో తెలుగు, ఆంగ్ల, హిందీ భాషల్లో అందించారు. ఆ తర్వాత ముక్కాలు- 2 పేరుతో రెండో పుస్త కాన్ని ప్రకటించారు. ఈ పుస్తకంలో.. పూర్ణచందు గారు రాసిన "ముక్కాలు" కవితల్ని.. ఆంగ్లంలో శ్రీ విహారిగారు, సంస్కృతంలో డా॥ పాలపర్తి శ్యామానంద ప్రసాద్గారు తమిళంలో శ్రీమతి జె. సత్యవాణిగారు, కన్నడంలో ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతిగారు మళయాలంలో శ్రీ ఎల్.ఆర్. స్వామి గారు మరియు హిందీలో శ్రీమతి హేమలతగారు అనువాదం చేసి.. ఒక్కో ముక్కాలును ఒక్కో పేజీలో.. ఏడు భాషల్లో.. 'ముక్కాలు -2" పుస్తకాన్ని వెలువరించి చరిత్ర సృష్టించారు. ఆరు భాషల్లోని పాఠకులను అలరించే విధంగా, ఎక్కడా పూర్ణచందుగారి మూల కవిత్వానికి భంగం కాకుండా అనువదించిన రచనలతో ఇలా పుస్తకాన్ని తేవడం ప్రశంసించదగింది.




ప్రతులకు:
డా॥ జి.వి. పూర్ణచందు
సుస్రుత ఆయుర్వేదిక్ హాస్పిటలు
సత్నం టవర్స్, బకింగ్గమ్పేట్
పోస్ట్ ఆఫీసు, గవర్నర్పేట్
విజయవాడ-520 002
సెల్: 9440172642

ఇక మూడు పాదాల్లో అందరినీ మురిపించే ముక్కాలు కోసం కవిగా పూర్ణచందుగారు ఎంపిక చేసుకున్న కవితా వస్తువులు భిన్నంగా ఉన్నాయి. అభివ్యక్తిలో కొత్తదనం ఉంది. వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే కవిత్వాంశ ఉంది.. సమాజం ఉంది.. సామాజిక చైతన్యానికి దోహదపడే సందేశం ఉంది. కవిత్వంతో సాహిత్య ప్రయోజనం కూర్చే సత్తా ఉంది. మూడు పంక్తుల్లో.. విలువైన భావాలను వస్తువు వెలుగులో ఆవిష్కరించే క్రమంలో పూర్ణచందు గారు ప్రదర్శిం చిన ప్రతిభను ప్రశంసించకుండా ఉండలేము. ముక్కాలు గురించి రాసిన మొదటి కవితలో సముద్రం అంత చెప్పాలని..

**చెప్పింది చుక్కలే.. కన్నీరులా!..**
**బిందువులు కలిస్తే సింధువు!!**

అంటూ మొదటి ముక్కాలులోనే కవి పూర్ణచందుగారు సూక్ష్మంలో మోక్షంలా.. తను తాత్వికతను ప్రదర్శించారు.

పూర్ణచందుగారు రూపుదిద్దిన మూడు పాదాల్లో పైకి సరళంగా కనిపించినప్పటికీ.. ఆయా పాదాల్లోని పదాల పరదా మాటున లోతైన భావాలకు చోటు కల్పించారు. ప్రతి ముక్కాలుకు ఓ శీర్షికను పెట్టి మరింత ఆసక్తిని పెంచారు.

"**అధికారం**" శీర్షికలో రాసిన కవితలో అధికారం యొక్క తీరు తెన్నులను చక్కగా తెలియజెప్పారు.

**వేయి సూర్యులు ఒకేసారి వెలిగినా-**
**ఎంత పగలో అంత రాత్రి..!**
**పై మెరుగులు పోగానే "చీకటి రాజ్యం"!** అని చెప్పడంలో కవి యొక్క ఔచిత్యం అభినందనీయమైంది. అధికారం శాశ్వతం కాదని.. పదవిలో ఉన్నంత కాలమేనని నర్మగర్భంగా వివరించారు. అధికారం పోగానే అంతా అంధకారమేనన్న జీవన సత్యాన్ని ఈ ముక్కాలులో ఆవిష్కరించిన తీరు బాగుంది.

"భర్త" శీర్షికతో రాసిన కవితలో..
**"తానొవ్వుతూ నొప్పిస్తూ రోకలి..**
**రోలు మీద మద్దెల మోత!**

**పచ్చడి కోసమేనా ఇంత రచ్చడి..?**
అంటూ చమత్కరించారు.

పూర్ణచందుగారు **'యవ్వనం'** శీర్షికతో రాసిన కవితలో ఇలా రాసి మెప్పించారు.

**కొండల ఎత్తులో ఎగిరే**
**ఊహల ఊసుల గాలిపటమా..?**
**పూల మనసుపై వాలకు, ముళు!** అంటూ ఓ వైపు యవ్వనంలో గాలిలో తేలిపోయే ఆలోచనలను.. అందంగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. కొండల ఎత్తుల్లో ఎగిరే ఊహల ఊసుల గాలిపటంలా అభివర్ణించడం బాగుంది. ఈ రెండు పంక్తుల్లో కావలసినంత రమణీయ భావాలకు చోటు కల్పించారు. ఊహా లోకాల్లో ఊరేగే యువతీ యువకులకు, చివరి పంక్తిలో చక్కని చురకను అంటించారు. పూలమనసుపై వాలకు- ముళుంటాయని హెచ్చరించారు.

నడుస్తున్న చరిత్రకు అద్దం పడుతూ "సంక్షేమ పథకం" పేరుతో ఓ కవితను తీర్చిదిద్దారు.

**అన్నదానం ఖర్చువంద**
**పోస్టర్ల ఖర్చు వెయ్యిన్నొకవంద**
**వార్తకే విలువ.. చేతకన్న..!** నిజమే కదా! ప్రచార ఆర్భాటానికి ఖర్చు ఎక్కువ అసలు ప్రయోజన ఆచరణకు వెచ్చించేది తక్కువ నేటి సంక్షేమ పథకాల్లోనూ.. బయటి ప్రపంచంలో మిగతా వారు చేస్తున్న తీరు తెన్నులను- ఈకవితలో చక్కగా ఆవిష్కరించారు.

ఈ పుస్తకంలో మూడు పాదాల్లో ఇలా ఎన్నో మినీ కవితలు ముచ్చటగా ముక్కాలు రూపంలో కొలువుదీరాయి. ఎన్నెన్నో భావాలను కవితాత్మకంగా మోసుకొచ్చాయి. అన్నింటికి మించి.. తెలుగు మూలానికి ఆరు భాషల్లో అనువదింపజేసి.. వాటిని ఒక చోట చేర్చి వివిధ ప్రాంతాల పాఠకులను అలరింపజేసిన పూర్ణచందుగారికి అభినందనలు తెలియజేద్దాం..



-దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## కిటికీలోంచి కిటికీలోకి

నిజమే....
చూపుల కిటికీ తెరిచినప్పుడే కదా
ప్రపంచం కళ్ళముందుకు వచ్చేది...
కిటికీ తెరిస్తేనే అసలైన జీవన కాంతి!

రేపటి కలల కోసం పరుగులు పెట్టే
పాదాలు...
జీవన మార్గాలని
వెతుకులాడే కళ్ళు....
విజ్ఞానమో... వినోదమో...
అడుగులు ఎటు
వేస్తున్నా... నడుమ నడుమ ఓ
మిథ్యా ప్రపంచము
నీడలు వెంటాడుతూ ఉంటాయి...!
జాగ్రత్త నాయినా...! జాగ్రత్త..!
మార్గమేదైనా
నడకంతా ఇప్పుడు
పాకురుబండల మీదే -!
వయసుతో పాటు
అల్లుకునే నీ ఊహల పిట్టగూడు
లోకి జొచ్చుకు రావటానికి...
నిన్ను నీ కదలికల్ని చదివేసే
పిట్ట నిన్ను
వెంబడిస్తూనే.

ఇంటినిండా ఎన్ని కిటికీలున్నా..
లోకం వైపుకు చూపులు మల్లవు -!
చుట్టుకున్న అంతర్జాలం అల్లికలో చిక్కి
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి
అవుతుంటాయి!?

బలహీనతల మధ్య
బతుకులన్నీ ఊయలూగుతుంటాయి..!

ఇంటి ద్వారాలగుండా
ప్రయాణం చేసినప్పుడు
లోనికి రావటం
బయటకు వెళ్ళటం సులువే-
అస్తమానం అరచేతిలో కులికే రంగుల
కిటికీ లోకి తొంగిచూడటం
అలవాటైన కాన్నుంచే
గది గదిలో కొత్తచీకటి
పరుచుకుంటోంది!?
మాటలు మరిచిన మనుషులంతా
బోలు బోలైపోతున్నరు ...
ఉత్త బొమ్మలై కొయ్యబారి
పోతున్నరు...
ఇప్పుడంతా కిటికీలోంచి కిటికీ లోకి
ప్రయాణం...
ఉన్నతావునే భూగోళం చుట్టుకు పోతూ
స్వీయలోక విహారం....!

ఒకప్పుడు
పక్కింట్లోనో..ఎదిరింట్లోనో..ముచటిస్తే
ఏదో బరువు దించుకున్న ఉల్లాసం...
ముఖాన ఓ చిరునవ్వు -
ఇప్పుడు మాత్రం
ఈ రంగుల కిటిలోకి
దూసుకెళ్ళితే చాలు
ఓ జారుడుతలం లోకి జారి
పడుతున్నట్టు...!

అలవాటు పడుతున్న
చూపుల అడుగుల్లో తడబాటు -
కొత్త సందేహాల సందోహాల మధ్య
గుండె కొట్టుకులాట -
వెతుకులాటల వెంపర్లాటలో
చేతుల్లోంచి
బొట్లు బొట్లుగా రాలిపోతున్న కాలం...!

కాచుకుని కూచున్న గాలానికి
నీ చూపుల చేప తగిలిందా...?
నడక ఇప్పుడు
దారుల్ని మరిచిపోతుంది...!
అడవిమధ్యలో ఆగమైనట్టు...
తెలీని కుంపటేదో రాజుకున్నట్టు...
ఈ పరిక్రంపలో ఇరుక్కున్న తలని
లాగేసుకోవటం అంత సులువేమి కాదు!

ఏ కిటికీ లోంచి దారి
ఎటుమళ్ళుతుందో...?
ఏ ఊబిలోకి దిగజారుస్తుందో...?!
మనిషిని.. మనసుని..బండరాయిని
చేయజూస్తున్న
ఆ కిటికిలతో జాగ్రత్త -!
కానరాని
బలివేదికలా...కళ్ళముందుకొచ్చే
ఒయ్యారాల జాతరలో జరపదిలం..!

ఆగం బెట్టే మాయల దారులెప్పుడు
మనిషిని దూరం చేయ జూస్తాయి-!!



-మోతుకూరి అశోక్ కుమార్
9247380976

## ఆధునిక అమ్మ

అమ్మ -నడుస్తున్న ఆత్మవిశ్వాసం
అమ్మ - అంతులేని ధైర్యనివాసం!
ఇంటిని ఎప్పుడో గెలిపించిన అమ్మ
ఇపుడు దేశాన్ని నడిపించడానికి
నడుం బిగించింది,
అమ్మ చేతివేళ్ళు గరిటెలను దాటి,
అభివృద్ధి సేవల్లో
చాకుపీసులైనాయి
లాఠీకర్రలైనాయి
కంప్యూటరు కీబోర్డులైనాయి,
నల్ల,తెల్ల కోటులైనాయి,
ప్రజాగొంతుల మైకులైనాయి,
అంతేనా,
అమ్మ చేతి లో ఇల్లు వెలిగినట్లు,
ప్రభుత్వ ప్రైవేటు సంస్థలూ
వెలుగుతున్నాయి
అమ్మ ,నిర్వహణలో కార్యాలయాలు
బద్ధకాలను ఊడ్చివేసి
పనిముగ్గుల నిలయాలైనాయి,
వ్యాపారసంస్థలు లాభాలపురుడులను
నిత్యం పోసుకుంటున్నాయి,
రాజకీయరంగం
లాలిత్యప్రగతినితో
లాలపోసుకుంటున్నది- అమ్మకదా!
అమ్మ ఎక్కడున్నా తనచుట్టూ
కుటుంబాన్ని కట్టుకుంటుంది,
తాను ముందుండి
చూపుడు వేళ్ళ చివర ముందుబాటలను
లిఖిస్తు ఆకట్టుకుంటుంది-
కళ్ళుమూసుకొని ఒకసారి మనచుట్టూ
ఉన్న సమాజంలో అమ్మ ను చూడండి..
నాయకత్వం పటిమ
నిర్వహణాసామర్థ్యం
దండిగ పూసిన దక్షత
మెండుగా పండిన నైపుణ్యం-
ఇదీ ప్రస్తుత ఆధునిక అమ్మ ..!
ఇంట్లో ఫోటోల్లో పూలదండల్లోని
త్యాగాల అమ్మలను స్మరించాల్సిందే,
అట్లే,
రేపటి సమాజప్రగతి మీద
తిరుగులేని సంతకమౌతున్న
ఆధునిక అమ్మ ను
గుండెగోడ మీద నిలుపుకొని
గౌరవించుకోవాల్సిందే,
ఆత్మవిశ్వాస ఆకాశమైన
ఆధునిక అమ్మలకు సలాములు,
ధైర్యమేరుశిఖరాలైన
ఆధునిక అమ్మలకు
జేజేలు!



-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

# నాన్నంటే..!!

'నాన్న' అంటే..
అనుబంధం ఒకటే కాదు..
బాధ్యతలెన్నో కలబోసి
పోతపోసిన నిలువెత్తురూపం..!!.
ప్రేమ ఆప్యాయతలకు
ప్రతిరూపం ఎవరని అడిగితే...
అమ్మ కూడా నాన్ననే చూపిస్తుంది !!.
ఎందుకంటే..
ఆమెకు జీవితంలో
భర్తగా తానున్నా..
ఆమెను వెన్నంటి ఉండే
మరో నాన్న అతనే కనుక..!!.
"నాన్న మనసు ఓ మహాసముద్రం"
లోతెంతో తెలియనంత..!!
తనవారు ఏ తీరంలో ఉన్నా..
తన ఆప్యాయతా కెరటాలతో
వారిని స్పర్శిస్తూనే ఉంటాడు..!!

"నాన్న ఒక స్ఫూర్తిశిఖరం.."
తనవారిని
ఉన్నత శిఖరాలు ఎక్కించటానికి..
బాటలు వేస్తాడు..
బాసటగా నిలుస్తాడు !!
"నాన్న ఎప్పుడూ అంతెత్తులోనే కనిపిస్తాడు.."
చూడటానికి దగ్గరగానే ఉన్నా..
అర్థం కావటానికి కొండ ఎక్కినంత కష్టపడాలి..!!.
"తాను ఓడిపోవటానికి
సిద్ధం అంటాడు నాన్న"
తనవారిని గెలిపించుకోవటానికి..!!.
"నాన్న ఎప్పుడూ వెనకబడే ఉంటాడు"
తనవారిని తనకంటే ముందుకు నడిపించటానికి..!!
వెనకబడినట్టుగా ఉంటాడంతే..
తనవారికి వెన్నుదన్నుగా ఉండాలని..!!

నాన్నంటే...
ఒక్కరోజు ఉదయం కాదు
నిత్య సూర్యోదయం..!!.
తానెప్పుడూ..
ప్రభాతసూర్యుడంత ప్రశాంతతతో ఉంటాడు..
అవసరమైనవేళ..
నడిపొద్దు సూరీడు అవుతాడు..
తాను అస్తమిస్తున్నా..
తనవారికి వెలుగులనే పంచుతాడు..!!.
గుండెకోనలో ఉదయిస్తూ..
జ్ఞాపకాల కోనేటిలో ప్రతిబింబిస్తూ..
ఆనందాల వెన్నెలను పంచే..
"పున్నమి చందమామ.. నాన్న" !!
"మా నాన్న !!"



-పేరిశెట్టి బాబు,
9247170800

# నా వందేళ్ళ రైలు ప్రయాణం

ఇరవైఏళ్ళ మైలురాయి
ఎప్పుడు వెళ్ళిందో తెలియదు
అరవైఏళ్ళ మైలురాయి ఎప్పుడు వచ్చిందో
తెలియదు
ఏం జరుగుతుందో తెలుసుకునే లోపల
డెబ్బైఏళ్ళమైలురాయి కూడా దాటేశాను
ఇప్పుడు ఆలోచనాసులోచనాలు
సర్దుకుని వెనక్కివెళ్ళాను
కాలచక్రం తిరుగుతూనేవుంది
జరిగేకాలాన్ని ఎవరూ ఆపలేరు
బాల్యము చదువులతో గడిచింది
యవ్వనం పోటీలతో నడిచింది
ఆగిపోతే ఓడిపోతానేమో ననే భయంతో
ముందుకు సాగాను
తరువాతి కాలం సంపాదన కోసం
పరుగులతో గడిచింది
నాపెళ్ళి, తరగని సమస్యలతో,
కుదుపులతో జరిగింది
జీవితం, తుఫానుగాలులలో
ఒడిదుడుకులతో సాగింది
సంసారసాగరంలోఈదుతూ
పిల్లల అవసరాలు తీర్చడం లో
నడుము వంగింది
అన్నీపనులు అయ్యాయి,
అనుకునేలోపే జబ్బు పడ్డాను,
సృష్టికర్త గుర్తొచ్చాడు
ఓపిక లేక ప్రార్థనచేయలేక
కూర్చున్నచోటే కూర్చుండిపోయాను
పైవాణ్ణి ఇన్నాళ్ళు మరిచినందుకు పైలోకం లో
ఎలాంటి శిక్షలుంటాయో తెలియదు
చేతులుకాలాక ఆకులుపట్టుకున్న చందాన
ఇప్పుడు అనుకుని లాభమేముంది
అంతాఅయిపోయింది ఇంకో
జన్మంటూవుంటే
చేసినతప్పులు సరిదిద్దుకునే
అవకాశందొరుతుందేమో
క్షమించమని ఆ పైవాణ్ణి కోరడం తప్పించి
ఇప్పటికి, ఇంక నేను
చేయగలిగింది ఏమీ లేదు
గతం, నెమరువేసుకోవడం తప్ప



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## నీవెవరివో ! నేనెవరినో!

నీవెవరివో ! నేనెవరినో!
ఏ భావమో
ఏ బంధమో.
ఏనాటిదో.
ఎరుగను నేను.
నాకు దూరమైన సాన్నిత్యానివి.
నాలోని నా అంతర్యానివి నీవు.
నేను పోగొట్టుకున్న
నా ఆత్మాంతర తత్వానివి నీవు.
అనుక్షణం నన్ను పట్టి లాగుతున్న
అవ్యక్త అనుబంధానివి నీవు.
నా హృదయం లోని హృదయానివి
నా ఆత్మ లోని ఆత్మవు.
నా ప్రాణం లోని ప్రాణానివి నీవు.
నీ కోసమే.
ఈ ఆవేదన.
ఈ నిర్వేదం.
ఈ ఆరాటం ఈ తపన
ఈ దుఃఖం ఈ విషాదం.
మరేలనో నీ లో.
ఏ భావమూ లేదు.
ఏ బంధమూ కానరాదు
ఏ భావబంధం లేని
రాగ రహిత హృదయమే ఉన్నది.
నేనెరుగరాని నీవు ఎరుకపరచని.
ఏ భావమో ఏ బంధమో
నీలో ఉన్నవేమో!
నీ వెవరివో ! నేనెవరినో!



-సురేంద్ర బాబు
9481046677

పుస్తక సమీక్ష

# నానీల బంధం

అక్షరాలను మట్టిలో ముంచి కవులుగా మొలకెత్తారు రాంబాబు, నాగ రవేషు గార్లు. నానీ ప్రక్రియకు ఇరవైఆరేళ్ళ ప్రాయమైనా, వయసుతో సంబం ధంలేకుండా నిత్యనూతనంగా మానసిక బంధంగా వర్ధిల్లుతోం దంటే నానీల నాన్న డాక్టర్ ఎన్.గోపీ గారి సంకల్ప శంకుస్థా పన ఎంత బలమైందో ఇన్నేళ్ళు దాటివచ్చిన మైలు రాళ్ళు తెలుగు సాహిత్య చరిత్ర పుటలలో మెరుపు ల్లా మెరుస్తూనే ఉండటం మంచి పరిణామం. చింతా రాంబాబు గారు, రమేషు గారూ వాటిని అందిపుచ్చుకుని నానీలతో ప్రవహించడం ఋజువు. కాదనలేనిది.

నానీలను అన్ని కోణాలలో రచించడం కవుల అభిరుచిని, ప్రతిభని తెలియ చేస్తుంది.

కలిసి నడిచే కవులు ఉన్నా, కలిసి సంకలనం వేసే స్థిరస్తాయిని ఎన్నుకోవడం వీరిద్దరికీ నానీల బంధం కుదిరింది.

మనిషి ప్రకృతికి చేసే ద్రోహానికి మనిషి మండిపడుతున్న సూర్యున్ని చూపిస్తూ

**సూర్యుని కళ్ళూ**
**ఎర్రబడ్డాయి**
**రోడ్ల ప్రక్కన**
**చెట్లు కొడుతున్నారుగా.**

అంటూ

నిజమే ఇది తరతరాలుగా మనిషి పెంచుకుంటూపోతున్న గాయాల పేరును చురకత్తిలా చూపించి హెచ్చరించారు. ఇక్కడ మనిషి నిలబడి తన పాపాన్ని కడుక్కోవాల్సినంతగా రాంబాబు గారీ నానీలో బోధించిన శైలి బాగుంది.

మనిషి మానవ సంబంధాలతో తిరగాల్సిన అవసరాన్ని, వినియోగించుకోవాల్సిన అవకాశాన్ని నానీలతో ఓ తోవలా పరుస్తూ... నానీల విదులను కవిత్వం జోడించి చెప్పడంలో నేర్పరితనాన్ని రమేష్ గారు గట్టి పట్టే పట్టారు అనడానికి అనేక నానీలు నిదర్శనం

ఇంటికి లేవు
ఇంకుడు గుంతలు
రోడ్డు మీద ఎన్నో
ఇంకని గుంటలు.
బిడ్డ
బువ్వ తిన్నది
అదేంటో
అమ్మకడుపు నిండిపోయింది.

అంటూ.

నేటి ఇంటి స్థితిని నానీ నియమగతులలో చెప్పడం పఠనం ద్వారా నేర్చుకున్న కవి నానీలను కవిత్వం గా నిరూపించడం రాంబాబుకు మనసులో పుట్టిన విద్యే.

అమ్మ కంట/
కన్నీరు
పెంచినం దుకు కాదు
పంచుకున్నందుకు.

వృద్ధాప్యం ఏగతిపాలవుతున్నదో ఆ స్థితిలో నిలబడి బలంగా వినిపించేలా చేసిన ఈ నానీ నడుస్తున్న సమాజ గమనాన్ని చూపిస్తుంది.

మరో ప్రక్క రమేష్ గారు ఎక్కడా నానీలలోని నియమాలను కవిత్వపాళ్ళనూ యగ్గించకుండానే చరుపులు చరుస్తున్నారు.

వసంతంలా
శోభిల్లుతోంది వనం
శిశిరాన్ని
ఎదురించడమే కారణం.




**ప్రతులకు:**
చింతా రాంబాబు
మట్టపర్తి నాగ రమేష్
9948178092, 8555901852

అనుభవం,అనుభూతిని అక్షరాభిని వేశంగా చూపించారు ఈ నానీలో.

ఇలా అన్ని నానీలనూ సమీక్ష చేసేలానే ఉన్నా... మిటాయి పొట్లమంతా విప్పి దోసిట్లో పోసేస్తే... వీరి నానీల స్నేహబంధం రుచి పోతుంది. మనసు ఊటలో చప్పదనం మిగులుతుంది. కొత్త పంథాలో ఇద్దరు స్నేహితులు ఇలా ఒకే పుస్తకంగా తీసుకురావడం గమ్మత్తుగానే ఉంది. వీరి నానీలు చదివి నానీ నియమాలు దాటకుండా ఎలా రాయెుచ్చో కొత్తగా రాసేవారు తెలుసుకోవచ్చు.

లోతైన మనసులు వీరివి కనుకే ప్రతీ నానీనీ వారి వారి లోతుల్లోంచి బయటకు తీసుకు వచ్చి ఆశ్వాదించమనీ, ఆశీర్వదించాలని నానీల కుటుంబంలో పంచిపెట్టడం సముచితంగానే ఉంది. ఇలా నానీల బంధం కొత్త కొత్తగా ఎప్పటికప్పుడు మొగ్గలు తొడగాలని హృదయానందకరంగా ఇరువురనూ అభినందిస్తూ ఈ నాలుగు మాటలు వ్రాసే అవకాశం ఇచ్చిన మా అనంత సాహితీ వేదిక ద్వారానే కవిగా ఎదిగానని నిజాయితీగా చెప్పుకుంటున్న మా చింతా రాంబాబు గారికీ, మట్టపర్తి నాగ రమేష్ గారికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ....



-కొత్తపల్లి
మణీత్రినాథరాజు.
7997826662

## రెండు పుస్తకాల ఆవిష్కరణ ఆహ్వానము

తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో
"యుద్ధగీతం", "కవన సమీరాలు" రెండు పుస్తకాల
ఆవిష్కరణ సభ
తేది : 01-జూన్, 2024 శనివారం సాయంత్రం : 5-00 గం॥లకు
వేదిక : కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.

సభాధ్యక్షులు : యెనిశెట్టి గంగాప్రసాద్ గారు ప్రముఖ కవి, రచయిత
ముఖ్య అతిథి : బైస దేవదాస్ గారు "నేటి నిజం" తెలుగు దినపత్రిక సంపాదకులు
ప్రత్యేక అతిథులు :
తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి గారు ప్రముఖ సంఘసేవకులు, సాహితీ పోషకులు
కొండి మల్లారెడ్డి గారు ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు
విశిష్ట అతిథులు
డా॥ జి. లచ్చయ్య గారు ప్రముఖ రచయిత, కాలమిస్టు.
సూరారం శంకర్ గారు ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు, కీర్తి పురస్కార గ్రహీత
వి.పి. చందన్రావు గారు ప్రముఖ రచయిత, నిజామాబాద్
డా॥ యస్.కె. రషీద్ గారు ప్రిన్సిపాల్, కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.
మారవేణి రాజన్న గారు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కామారెడ్డి.
ఆత్మీయ అతిథులు
డా॥ కాసర్ల నరేష్ రావు గారు ప్రముఖ కవి, రచయిత
నార్ల అరుణ్ కుమార్ గారు పండిత పరిషత్ టి. జిల్లా అధ్యక్షులు
అంభీర్ మనోహర్రావు గారు ప్రముఖ వ్యాఖ్యాత
అల్లి మోహన్ రాజ్ గారు తె.ర.వే. జిల్లా ప్రధాన కార్యదర్శి
డా॥ బాలు గారు రక్తదాతల సమూహ ఫౌండర్, కామారెడ్డి జిల్లా.
కప్పెర రవీందర్ రెడ్డి గారు వైస్ ఎంపిపి, బీబీపేట్.
వెంగల నాగరాజు గారు తె.ర.వే. జిల్లా అధ్యక్షులు, రాజన్నసిరిసిల్ల.
పుస్తక సమీక్షకులు
సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గారి "యుద్ధగీతం" ----- డా॥ మేకల రామస్వామి గారు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు
ఎన్నీల ముచ్చట్లు ఉగాది కవితా సంకలనం "కవన సమీరాలు" ----- డా॥ నమిలకొండ సునీత గారు ప్రముఖ రచయిత్రి
సభా ఆహ్వానం, కార్యక్రమ సమన్వయం, వ్యాఖ్యానం పబ్బ విజయశ్రీ గారు ప్రముఖ వ్యాఖ్యాత
నోట్ : రక్తదాతల సమూహం, కామారెడ్డి సభ్యులకు సత్కారం.
"కవన సమీరాలు" పుస్తకంలోని కవులకు అతిథులచే సత్కారం.
కార్యక్రమానంతరము భోజన సౌకర్యం కలదు

